UNIVERSAL
LIBRARY
OU_204073
UNIVERSAL
LIBRARY

శ్రీరస్తు.

# శ్రీ తుకారామస్వామిచరిత్రము,

చెన్నపురి:
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే
ప్రకటితము.
1931.

All Rights Reserved.

Printed by
V. RAMASWAMY SASTRULU & SONS,
at the 'VAVILLA' PRESS,
Madras.—1931.

# విన్నపము.

శ్రీతుకారామస్వామిచరిత్రము భగవద్గీతలవలె పరమ పవిత్రమైనది. దానిని శ్రద్ధతో పఠించినవారికి ఈశ్వరలీలలు సులభముగ బోధపడగలవు.

ఆంధ్రదేశమున భక్తిసాంప్రదాయము మఱల ప్రారంభము కావలసియున్నది. ఈకార్యమున కిదిసాధనముగానుండ గలదనితలచి ఈచిన్నిచరిత్రను ప్రకటించుచున్నాము.

తుకారాము అభంగములు భక్తిరసముతో దొప్పదోఁగుచున్న మధురఫలములు. మాదేశీయులు ఈచిన్నిగ్రంథము నాదరించి వానిని ఆంధ్రీకరించి ప్రకటించుటను మాకు ప్రోత్సాహము కలిగింపఁగోరుచున్నాము.

ఇట్లు,

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్ సన్స్.

శ్రీరస్తు.

# శ్రీతుకారామస్వామి చరిత్రము

## ప్రథమాధ్యాయము.

మహారాష్ట్రదేశమున ఇంద్రాణీనదీతీరమున దేహూ యను నొకగ్రామము కలదు ఆగ్రామమునందలి శూద్రులలో బోల్హోబామోరే యనునాతఁడు అత్యుత్తమపురుషుఁడు. ఆతని భార్యపేరు కనకాబాయి.

ఆతఁడు మంచిసంపన్నగృహస్థుఁడు. కులవృత్తియగు వర్తకమున నాతఁడు చాల చతురుఁడు. సాధారణముగా అబద్ధములాడియు, తప్పులెఖలువ్రాసియు, తప్పుతూనికలు తూచియు, పిచ్చపాత్రలతో కొలిచియు, హెచ్చులాభములను గడించుటలో చతురు లనేకు లుందురు; గాని మన బోల్హోబా అట్టివాఁడు కాఁడు అసత్యములేకుండ, హెచ్చువెలలువేయకుండ, తప్పుతూనికలు మొదలగునవి లేకుండ, ధాన్యాదికములలో మట్టి మున్నగునవి కలుపకుండ, పిల్లలు వచ్చినను ఒకటేధర కిచ్చుచు రూపాయ కింత యని కనిష్ఠప్రమాణమున లాభము గడించుటయందాతఁడు చతురుఁడు. పైని ఉదహరించినకారణముల వలన అనేకు లితనితోడనే కాతాపెట్టుకొనుటవలన రకము హెచ్చుగా తిరిగి, వానచినుకులే వాగులై మహానదులైనట్లు కొలదిలాభమే చేరి మొత్తమై హెచ్చుగా లభించుచుండెను.

ఈవర్తకముతోబాటు అతనికి వంశపరంపరాప్రాప్తము లగు మఱికొన్నియోగ్యతలుగూడ గలవు. వానిలో భగవద్భక్తి, నిరతాన్నదాతృత్వము, శాంతి, శమదమములు, పరోపకారపరాయణత్వము, సజ్జనసహవాసము—ఇవి ప్రధానములైనవి. ఇతరకుటుంబమునుండి వచ్చినను కనకాబాయికిగూడ ఈ యోగ్యతలు అలంకారములై యుండెను. అగుటవలన ఆ దంపతులు ఎందును భేదభావములేక ఐశ్వర్యముండినను గర్వము ఎఱుంగక అందరికిని విశ్వాసపాత్రులై అందరిని ఆదరించుచు, అందరిచేతను ఆదరింపఁబడుచుండిరి. వారిఐశ్వర్యము వృద్ధియగుటకు పరోక్షముగ నీయోగ్యతలును ప్రధానకారణములై యుండెను.

అన్నియుగలవు; గాని అంచునకు తొగరు లేదన్నట్లు ఐశ్వర్యము, జనాదరణము—సకలము నున్నవి; గాని వారికి సంతానము కలుగలేదు. ఇఁక నెన్నియుండిన నేమి? అన్నియును వారికి దుఃఖమునే కలిగించుచుండెను. అన్నియు అసంతృప్తినే కలిగించుచుండెను.

కనకాబాయికి వయస్సు పెరుగుచుండెను. దానితో ఆదంపతుల దుఃఖమును పెరుగుచుండెను. ఇదిచూచిన యిరుగు పొరుగువారికిని అట్లే యుండుచుండెను.

తుదకు వారు సంతానము కలుగుటకైనను, ఆనందము కలుగుటకైనను, ఐశ్వర్య మబ్బుటకైనను, తుదకు దేనికైనను విఠోబాతప్ప వేఱుగతి లేదని నిశ్చయించుకొనిరి. విఠోబా వారికి కులదైవము. బోల్హాబాకు పూర్వము ఏడవతరము వాఁడగు విశ్వంభరుఁడు నియమముతప్పక ప్రతియేకాదశికిని—

ఇట్లు పదునారుపర్యాయములు పాదచారియై పండరిపురమున కరిగి విఠోబాను సేవించెను. అందుకు ఫలముగా విఠోబా అతనికి ఒకరాత్రి స్వప్నమున సాక్షాత్కరించి "నేను మీగ్రామ పరిసరమునందలి మామిడితోటలో విగ్రహరూపమున వెలసియున్నాను. ఇఁకముందు నన్ను ఆరూపమునందే అర్చింపుము" అని యానతిచ్చెను. మఱునాఁడు ఉదయము విశ్వంభరుఁడు పోయిచూడఁగా చెప్పినచోటనే చక్కని విగ్రహము దొరకెను. తోఁడనే అతఁడు ఇంద్రాణీతటమున ఆలయమును నిర్మింపించి అందావిగ్రహమును ప్రతిష్ఠచేయించెను.

అదిమొదలు ఆవంశమువారు ఆస్వామిని మిగుల భక్తిశ్రద్ధలతో సేవించుచుండిరి.

బాహ్లాబాయు అట్లే సేవించుచుండెను; గాన ఇంతకు పూర్వముచేసిన సేవ అంతయు నిష్కామముతోడనే చేసెను. ఆస్వామి తనపూర్వులచే ప్రతిష్ఠింపఁబడెను.తమకు కులదైవము. భగవద్భక్తి, భగవదారాధనము మనుజుని ఆత్మోన్నతికిప్రధాన సాధనములు. ఈయుద్దేశములతోడనే అతఁడిదివఱకు విఠోబాను సేవించుచుండెను. ఇపుడు సంతానఫలమునుగోరి సేవింపసాగెను.

కనకాబాయియు భర్తవలె ఆశాపూరితహృదయముతోడనే స్వామిని భక్తిశ్రద్ధలతో పూజింపసాగెను.

కొలఁదికాలమునందే కనకాబాయి గర్భవతియయ్యెను. పదవమాసమున కుమారుఁడు కలిగెను. అతనికి శాజీ అని పేరు పెట్టఁబడెను.

మఱికొంతకాలమున కామె మఱల గర్భవతి యయ్యెను. శాజీని చూచుకొనియే బ్రహ్మానందపడుచుండిన బోల్హాబా మఱింత ఆనందించెను; గాని యీతడవ కనకాబాయి ప్రవర్తనము మాఱిపోయెను. ఆమె తఱుచు ఎవరితోడను మాట్లాడదు. సదా విఠోబాను స్మరించును. దేనియందు నపేక్షలేక, ఏమియు తలంపక, ఒక్కొక్కప్పుడు భోజనమైన సరిగ చేయకుండును. తఱుచుఏకాకినియై యిష్టమువచ్చినచోటికెల్ల పోవుచుండెను.

బోల్హాబా యిదిచూచి చాల గాభరాపడెను. ఇరుగు పొరుగులవారు, బంధువులు, స్నేహితులు,—తుదకు చూచినవారుకూడ ఆశ్చర్యచకితులైరి; గాని పురుడువచ్చినవెంటనే ఆమె ప్రకృతిలోపడెను. చూడఁగా ఆమె యెప్పటి కనకాబాయియే.

బోల్హాబా మఱియొకకొడుకు పుట్టినందుకు, భార్య స్వస్థురాలైనందుకు చాల సంతసించి విఠోబాకు ధన్యవాదములర్పించెను. ఈ రెండవకుమారున కాతఁడు తుకారాము అని పేరుపెట్టెను.

మఱికొంతకాలమునకు కనకాబాయి మఱియొకకుమారుని, ఒకకొమార్తెనుగూడ కనెను.

లేదులే దనుకొనిన సంతాన మిట్లు వృద్ధికాఁగా ఆదంపతులును, వారి ఆత్మీయులును, ఊరివారునుగూడ సంతోషించిరి.

సిరి, సంపద పుష్కలముగా నున్నవి. అయినను ఆదంపతులు విఠోబాను మఱచిపోలేదు. విఠోబాయెడల భక్తి వారికి చిరసంచితమైనది. అది వారిరక్తమునందే లీనమైయున్నది.

సహజమైనభక్తి సంతానప్రాప్తివలన మఱింతవిజృంభించి అనుదినము వారియింట హరిభజనము సంకీర్తనము జరుగునట్లు వికసించెను.

ఈభజనమును, ఈసంకీర్తనములును బోల్హాబా సంతానమునకు—అందును విశేషించి తుకారామునకు మంచిసంస్కారము కలిగించెను. అతఁడు మాటలాడ నేర్చినదిమొదలు విఠోబాను స్మరింపసాగెను. ఆటలాడ నేర్చినదిమొదలు హరిభజనము చేయసాగెను. భక్తి, శుచిత్వము, నిష్ఠ, త్యాగబుద్ధి యివి ఆతనికి ఇట్లు చిన్నతనమునందే అంకురించి వయస్సుతో గూడ క్రమవికాసము నందెను.

యుక్తవయస్సు రాగానే బోల్హాబా కుమారులకు, కొమార్తకును చాలవైభవముగా పెండిండ్లుచేసెను.

సహజముగపరిమితమైనవైరాగ్యము. ఆపైనివార్ధకము. ఈకారణములవలన బోల్హాబా గృహనిర్వహణభారమును తప్పించుకొనదలఁచెను. సంసారమున లోటులేనపుడు—కొడుకు లెదిగినతరువాతగూడ ఇంకను ఆర్జనాదులయందు మునిగియుండుట మనసాంప్రదాయము కాదు. బోల్హాబా యిట్లు వానప్రస్థమున ప్రవేశింపఁదలంపఁగా జ్యేష్ఠపుత్రుఁడగుశాజీ అందుకు ప్రతికూలించెను. చిన్నప్పటినుండియు నాతఁ డాయింట నందరికంటెను హెచ్చుగా విరాగియై యుండెను. అయినను అతఁ డిట్లు చేయునని తండ్రి అనుకొనలేఇట్లు తానుదు. చేసినకల్పనకు విఘాతము పొడసూపఁగా బోల్హాబా ఆభారమును తుకారాముమీఁద మోఁపెను. కానైతే తుకారా మప్పటికి పదమూడేండ్లవాఁడే. అయినను పెత్తనమనిన నాతని కధి

కాసక్తియుండెను. వయస్సు ముదిరినకొలఁది, కొన్నికొన్నివిశిష్ట సన్నివేశములు తటస్థించినకొలఁది అతనికి వైరాగ్యము ప్రబలి సన్న్యాసికల్పుఁడైనా అతనికి ప్రారంభయౌవనమున విషయ సుఖాసక్తి యధికముగా నుండెను.

తండ్రి యాజ్ఞయగుటయే తడవుగ నతఁ డింటిపెత్త నము వహించెను. పెద్దపరివారముతోడి వ్యాపారము. దానికి తగిన గృహపరిస్థితులు. తుకారాము ప్రతిభావంతుఁడే కాకుండి నచో అంతచిన్నతనమున హిమగిరికంటెను భారమైన ఆభార ములకు వహింపలేక నలిగిపోయియుండును. ఊరివారు, బంధు వులు కొందరు తుద కట్లగుననియే తలంచిరి; గాని తుకారాము తొణకలేదు. చాలధైర్యముతో నతఁడు కర్తవ్యనిష్ఠుఁడయ్యెను. కొన్నికొన్ని వ్యాసఘట్టము లడ్డుకొనినపుఁడాతఁడు తల్లిదండ్రుల సలహా గైకొనుచుండి నాసకలమును భద్రముగా నిర్వహింపఁ దగిన అర్హతకలవాఁడయియే యుండెను.

తోడివర్తకులలో నతనికి మంచిపలుకుబడి యేర్పడెను. ఆదాయమును పెరిగెను. కాలము హాసన్ముఖమై కడచిపోవు చుండెను.

తుకారాము, ప్రథమభార్య శ్వాసకాసరోగార్తయగుట వలన జిజీబాయి అను నామెను మఱల పెండ్లిచేసికొనియెను.

ఇట్లు సుఖముగా కొంతకాలము గడచిపోయినది. ఉన్న ట్లుండఁగా బోల్హాబాయు, కనకాబాయియు ఏకకాలమున చనిపోయిరి. అప్పటికి తుకారాము పదునేడుసంవత్సరముల వాఁడు.

# ద్వితీయాధ్యాయము.

ఆస్థితిలో గూడ నాతఁడు ధైర్యమును గోలుపోలేదు. తలిదండ్రులను గుఱించినవిచారము మాత్రమధికమైయుండెను. బిడ్డలనిన వారి కధికప్రేమ. అందును తుకారామునెడల ప్రత్యేకాభిమానము కలదు. తల్లిదండ్రులవలన నీయభిమానము నాతఁడు చాల హెచ్చుగా ననుభవించియుండెను. ఎంద రోదార్చినను, ఎన్నివిధముల ప్రయత్నించినను అతఁ డీదుఃఖమును దిగమ్రింగుకొనజాలకపోయెను.

ఈస్థితిలో గూడ కాలము దొరలియే పోవుచుండెను. వ్యాపారము యథాపూర్వముగనే సాగుచుండెను. అట్టిబాల్యమునగూడ ధనముగలస్వాతంత్ర్యము నతఁడు దుర్వినియోగపరుచుకొనకుండుట ప్రశంసాపాత్రముగా నుండెను.

ఇట్లును ఉండఁగా శాజీభార్య చనిపోయెను. ఈవిధముగా మఱింత స్వేచ్ఛ సంభవించుటవలన "దుఃఖమయసంసారమునుండి యెప్పుడు విముక్తిగాంతు" నని క్షణక్షణము నెదురు చూచుచుండిన శాజీ తీర్థయాత్రలకు బయలుదేఱిపోయెను.

తుకారము ధైర్యనిధియే. అందుకు సందేహము లేదు; గాని క్రమక్రమముగ సంభవించిన యీసన్నివేశమువలన ఆతనిహృదయము వేఱుమార్గము త్రొక్కెను.

వైరాగ్య మాకుటుంబమువారి పైతృకధనము. అయితే తుకారామునం దది యింతవఱకును నిగూఢమై, నిద్రాణమై యుండినది. అతనిప్రవృత్తి అతఁడు వైరాగ్యవంతుఁ డగునని యూహించుట కెంతమాత్రము నవకాశమీయనిదై యుండెను.

సంవత్సరమంతయు భూమియందు పడియే యుండినా, అనేకపర్యాయము లనేకవిధములుగా జలసిక్తముకూడ నయినా, వార్షిక ప్రథమసేచనమువలన గాని బీజము మొలకలెత్తినట్లు తుకారాము హృదయమున నిబిడమై కాలాచ్ఛన్నమై యుండినవైరాగ్య మిప్పుడుగాని పొటమరింపలేదు. ఇంతేగాదు. తలిదండ్రులమృతి, వదినగారిమృతి, అన్నగారి గృహత్యాగము ఇన్ని యాకస్మికసంభవములవలన "ఇది యెప్పటికిని స్థిరమే. దీనికి విచ్ఛిత్తిలేదు" అనుకొనిన యేకశిల యగుకొండపడికెడి తుపాకిమందువలన తుత్తునియలై యెగిరిపడినట్లు హఠాత్తుగా రేగిచూచుచుండఁగా పెరిగిపోయినది.

కని, తనకై పడరానికష్టములు పడి పెంచిన జననీజనకులు చనిపోయిరి. రక్తసంబంధియగు సోదరుఁడు వెనుకకు తిరిగి చూడకుండ ఊర్ధ్వశ్వాసముతో విడిచిపోయెను. "ఆత్మసంపర్కముగలవారే యిట్లయిన నిఁక మానవునకు స్థిరముగా నుండునది యేమి? ఈశరీరము, 'నేను, నాది' యను నీయహమిఁక, మమకారమునుమాత్రము స్థిరమైనవా? ఈజన్మమునకు పరమావధి యేమి? సాధ్యము, ప్రాప్యము నేది? ఆపాతరమణీయమై, దుఃఖభూయిష్ఠమగు నీజన్మము మఱల రాకుండుటకుపాయమేమి? ఇది సాధ్యమా?" ఇట్టి యాలోచనము లాతని హృదయమున పెల్లొత్తెను.

అవిద్య నశించిన కనపడుచున్నది—మోహజనకమై యున్నదంతయు అశాశ్వతమే. మఱియు పతనకారణమే. ఈ నిశ్చయము కలిగినచో అంతయు విరక్తిజనకమే.

తుకారాముహృదయమున ఈతర్కము ప్రారంభమైన వెంటనే దీనికి బలము కలిగించు సన్నివేశములే ప్రత్యక్షమైనవి.

అంతయు నీశ్వరాధీనము. మానవునివలన గ్రుడ్డిగవ్వ కూడ కాదు; కావున ఈశ్వరు నాశ్రయించుటకంటె ముక్తి మార్గములేదు. ఈశ్వరసేవ, ఈశ్వరస్మరణము, ఈశ్వరధ్యానము—ఇదియే తరణోపాయము.

అయితే యీశ్వరుఁ డెవరు? ఎక్కడ నున్నాఁడు? ఎట్లుండును? ఈశ్వరసేవావశ్యకమును గుర్తించినవారి కీప్రశ్నలకు సమాధానములు దొరకుట కష్టముకాదు.

చంకలో బిడ్డను బెట్టుకొని ఊరంతయు వెదకినట్లు ఈశ్వరునియెదుట, ఈశ్వరుని అంకతలమున నుండియు నీశ్వరాన్వేషణము ప్రారంభించిన వారికి ఈశ్వరదర్శన మెట్లగును? చూడఁగలవాని కంతట నీశ్వరుఁడే కాన్పించును "అందుగల డిందు లేడని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం" డనినాఁడు ప్రహ్లాదుఁడు. ఈశ్వరుఁడు లేని వస్తు వేది? జిజ్ఞాసువునకు చలిచీమ యందును బ్రహ్మదర్శన మగును. ఆకులలో, లతలలో, చెట్టులలో, పుట్టలలో, సరీసృపములలో, రాళ్లలో—అతంటను భగవంతుఁ డున్నాఁడు. జగమంతయు రామమయమే. ఇది అనుదినము, అనుక్షణము కన్నులయెదుట ప్రత్యక్షమగుచుండియు బోధపడనిసంగతి. బోధపడినచో నిఁక కావలసిన దేమి?

ఈకష్టములవలన తుకారామున కిట్టి వివేకమే కలిగినది. నే నెట్టివాఁడనో నీవు నట్టివాఁడవే. చీమయు నట్టిదే. చెట్టు నట్టిదే. ఇఁక "నేను" లోఁగల వైశిష్ట్య మేమి? 'నాది,' అనుకొనుట కధికార మేది? 'ఆత్మవత్సర్వభూతాని,' యన్న యీ

వివేకము కలిగినపుడు ఇఁక తృష్ణలేదు. అంతయు తృప్తియే. అన్నములేక యొకఁడు ఏడ్చుచుండును. వానిని చూచినచో వివేకవంతుఁడు అన్నము ఉండియు దుఃఖించుచును ఏల? వానికి లేదని దేనికై యొక ఏడ్పున్నాఁడో అది తనకొక్కడకు నెట్లు భోజ్యము?

భగవద్భక్తులు తమ కున్న సర్వస్వమును త్యాగము చేయుటకు కారణ మీజ్ఞానము. చలిచీమలో బ్రహ్మను దర్శించినవాఁడు అవి ఆకలితో నకనకలాడుచుండుట చూచి యెట్లోర్వగలఁడు?

తలిదండ్రులు గతించినపిమ్మట—అన్న గృహత్యాగము చేసినపిమ్మట తుకారాము ప్రవృత్తి యీస్థితికే వచ్చినది. అతఁడు పూర్వమువలె వర్తకమే చేయుచుండెను; గాని బేరమునెడల ఆగాంభీర్యము లేదు. లాభమును గుఱించి ఆపట్టుదల లేదు. డబ్బులేకున్న తరువాత చూచుకొనవచ్చును. "ఈవస్తువు లేకున్న వాఁడు చిక్కులుపడును. కావున పట్టుకొని పోవలసినదే" ఇది యాతని పద్ధతి.

అచిరకాలమునందే తుకారాము హృదయ మింత పరిపక్వమై పోయినది. చూచుచుండఁగా నాతఁడు పూర్తిగా మారిపోయెను. పట్టిచూచినచో నతఁ డిప్పుడు శేటు తుకారాముకాదు, భక్తతుకారాము, త్యాగితుకారాము.

ఈమానసికపరివర్తనమువలన తుకారాము స్థితిగతులన్నియుపరివర్తనముపొందినవి. తోడివర్తకు లతనితో కాతాలు మానుకొనిరి. సరకై పోవుచుండెను; గాని డబ్బు కనపడదు. ఇవ్వవలసినవారు వాయిదాలువేయుచుండ తా నీయవలసినచోట

నిర్బంధములు కలుగసాగెను. సంసారవ్యయములు తెఱుగక యెప్పటివలెనే యుండెను.

అతఁడు పెద్దవ్యాపారము మాని చిల్లరవర్తకము ప్రారంభించెను; గాని బేరములమీఁద కంటె నతనికి విఠోబానామస్మరణమున నధికాసక్తి యుండెను. ఒక్కొక్కప్పు డాతఁడు తన్మయుఁడై యుండి వచ్చినవారిని చూడకుండెను. చూచెనో వా రడిగిన ట్లెల్ల వస్తువు లీయసాగెను. అరువులుగూడ హెచ్చిపోయెను.

కొంతకాలమున కది మానివేసి పిరకాటకము ప్రారంభించెను. (పిరకాటక మనఁగా ధాన్యపుబస్తాలను ఎద్దులమీఁద వేసి అమ్మకమునకు గ్రామములకు పోవుట.)

పోవుచుఁబోవుచు నతఁడు హఠాత్తుగా నిలిచిపోయి విఠోబాస్మరణము ప్రారంభించి తుదకు భజనలో మైమఱచుచుండును. ఉండియుండి ధ్యాననిష్ఠుఁ డగుచుండును. నడుమనడుమ నెట్లున్నవాఁ డట్లే నిలిచిపోయి మననము చేయుచుండును.

సరకు వేగముగనే విడుదలయగుచుండెను; గాని చేతిలో డబ్బుపడదు. పడెనో అసలునకే తక్కువ. లాభముకొఱకు పోయి అతఁడు నష్టమునకు అమ్మసాగెను.

ఒకప్పు డాఁతడు నాలుగెద్దులమీఁద ధాన్యము వేసికొని బయలుదేఱెను. తనవలెనే పిరకాటకము చేయువారు కొందఱు బయలుదేరి పోవుచుండఁగా నతఁడు వారితో కలిసెను. అందుకు వారి కేమియు నిష్టము లేదు. అతని హరిభజనము, స్మరణము, బేరములపద్ధతి వారికేమియు నచ్చకుండెను. ఒక ఆలోచన లేదు.

ఒక యెత్తు లేదు. బేరమాడుట లేదు. అతని ప్రవృత్తియంతయు వారికి కేవలము వ్యతిరేకముగ నుండెను. అగుటచే వారు అతనిని తప్పించుకొని నడిత్రోవలో విడిచిపెట్టిపోయిరి. నిర్జనారణ్యమున నతఁ డేకాకి యయ్యెను. దొంగలు వచ్చి యేమైన చేయుదురేమో నని యతనికి భయములేదు. క్రూరమృగముల వలని భీతిగూడ నెరుఁగఁడు. అతనికల యూహయెల్ల చీకటిపడనున్నది. ముందున్న గ్రామమునకు పోవలెను. సరకు అమ్మి సంసారమును చక్కఁగా దిద్దుకొనవలెను. ఇంతకంటె నతనికి మఱొక యాందోళనము లేదు. "ఇంతవఱకును నీవు సంపాదించిన దేమి? అడిగినట్లెల్ల నిచ్చివేసి సరకులను పాడుచేయుచున్నావు" అని మనస్సు అడుగఁగా నతఁడు "ఈసారి సరిగా ప్రవర్తించెదను" అని యనుకొనుచుండెను; గాని యెవరైన కొనవలచినవారు వచ్చినచో మఱల నెప్పటియాటయే. "వారిపద్ద డబ్బు లేనట్లున్నది. నేను వారికి కావలసినది యీయకున్న వారు చిక్కుపడుదురు. అది యీశ్వరద్రోహ మగును" ఇంతే ఆతని ఊహ.

నాఁడట్లు తోడివర్తకులు వెడలిపోయిన తరువాత అతని నాలుగెద్దులలో నొకటి ముందుకు సాగలేక కూలఁబడెను. బస్తాలు క్రిందఁబడిపోయినవి. దానిని లేవదీయవలెను. బస్తాలు దాని కెత్తవలెను; గాని యీ రెండుపనులు నతనికి సాధ్యముకా లేదు. ఒక్కఁ క్షణ మటునిటు చూచునప్పటికి ఈప్రవృత్తిపోయినది. విఠోబా స్మృతికివచ్చెను. చీకటిపడనుండెను. మబ్బులు ఆకసమంతయు క్రమ్మసాగెను; గాని అతఁ డిదియేమియు చూడ లేదు. భజనప్రారంభించెను. ఆతన్మయత్వము చాలసేపటివఱకు

నుండెను. కొంతసేపటి కొకదృఢకాయుఁడు వచ్చి సాయముచేసి వెడలిపోయెను. తుకారాము ముందుకుఁబోవుచు "విఠోబాయె వచ్చి సాయముచేసె" నని యానందించెను.

ఆప్రయాణమునగూడ నతనికి నష్టమేవచ్చెను. ఇట్లు ఆచార మగుటవలన ఉన్న దంతయు నై పోయెను. వెండి బంగారు నగలు అమ్మి అతఁడు కొన్నిదినములు వర్తకము సాగించెను. అదియు నై పోయెను. మూడెద్దులు చచ్చిపోయినవి. తుదకు సర్వము నాశనమైనది.

ఇదిచూచి బంధువులు, స్నేహితులు, ఊరివారు నతనిని నిందింపసాగిరి. "హరిభజనమే నిన్నింత చేసినది. అది మానిన గాని నీవు పనికిరావు. డబ్బులేనివానికి భజన అన నేమి? దానివలన పొట్టగడచునా? హరి తనభక్తులను దరిద్రులను చేయునని పెద్దలు చెప్పెదరు. నీయైశ్వర్యమంతయు హరియే నాశనముచేసెను. ఇది చూచుచుండియు నీవు దానిని మానవు" అని వారు నిందింపసాగిరి. దీనికి తోడు జిజీబాయిగూడ అతనిని తర్జనభర్జన చేయసాగెను.

---

## తృతీయాధ్యాయము.

ఎవ రేమిచేసిన నేమి? ఫల మొక్కటే. ప్రారంభమున అతివిషయసుఖాసక్తుఁడుగను, వర్తకమున చతురుఁడుగను ఉన్నభర్త యిట్లు మాడిపోయినందుకు జిజీబాయి చాల విచారించెను; గాని అతనిప్రవృత్తి మాఱలేదు.

ఒకొక్కవ్యాపారమే యిట్లు దిగనారుచునే యుండఁగా నాతఁడొకప్పుడు "ఇదికాదు పని" అని మిరెపకాయల వ్యాపారము ప్రారంభించెను. ఆతఁడొకగ్రామమున ఒక దేవాలయముచెంగట అంగడిపెట్టెను. ఒకఁరొకరేవచ్చి బేరములు ప్రారంభించిరి. వారడుగుటయే తడవు ఎట్లడిగిన నట్లు. ఇంతియే గాని ఆతఁడు తన కిట్టుబడియైన చూచుకొనలేదు. "పాపము వారు బీదలు. వారివద్ద లాభముపుచ్చుకొనుట యీశ్వర ద్రోహము." ఇది యాతనివృత్తి. ఆవచ్చినవారందఱును తన కంటె ధనికులని యతఁ డూహింపలేదు. ఊహించినను ఎక్కువ లాభము పుచ్చుకొనుట ద్రోహము అని తలఁచెను.

రెండుమూఁడుదినములలోనే సరకు తరిగిపోయెను. ఆతఁడు విరోబాగుణములను పరిగణింపఁజొచ్చెనేగాని అమ్మకము వలన తనకెంతసొమ్మువచ్చినదో, మొదట పెట్టుబడి యెంతయో, ఇప్పుడేస్థితిలో నున్నదో చూచుకొనలేదు.

ఇఁక నొకబస్తాసరకు ఉన్నదనఁగా నొకబ్రాహ్మణుఁడు వచ్చి "అయ్యా! నేడు నాయింట నొకశుభకార్యము. బంధువులు వచ్చి యిల్లు నిండియున్నారు. అక్కడక్కడ అన్నివస్తువులును సంపాదించుకొంటిని. ఇఁక మిరెపకాయలే లోటు. నేను బీదవాఁడను. నేడు డబ్బీయజాలను; గాని మీసొమ్ము హరింపను. దయయుంచి నాయవసరముతీర్చినచో మఱొకప్పుడు మీ సొమ్ము పువ్వులలోబెట్టినట్లు తెచ్చియిచ్చెద" నని చెప్పుచు ప్రార్థించెను. అదివిని తుకారాము మిగుల కటకటంబడి "ఇప్పుడు మన మీసాయముచేయకున్న నీతఁడు కష్టములపాలగును" అని తలఁచి "నీకెన్ని మిరెపకాయలు కావలసిన అన్నియు పట్టు

కొనిపొమ్ము" అని చెప్పెను. బ్రాహ్మణుఁ డందుకు సంతోషించెను; గాని యింకను బిక్కమొగముతోఁడనే యుండెను. ఏమని యడుగ "నావద్ద సంచిలేదు. మీరు సంచితోఁడనే మిరెప కాయ లిచ్చునెడల డబ్బిచ్చినపుడు సంచియు నిచ్చివేసెద"ననెను. అందుకును తుకారాము అంగీకరింపఁగా ఆబ్రాహ్మణుఁ డానందముతో సరకు పట్టుకొనిపోయెను. బ్రాహ్మణుని యానందము చూచి తుకారాము బ్రహ్మానందపడెను.

ఇట్లాతఁడు వర్తకము సాగించి పెట్టుబడిలోఁగూడ మూఁడువంతులు నష్టపెట్టుకొని యింటికి బయలుదేఱెను. మఱి యొకఁడైనచో అట్లు గుడ్డిగా వ్యాపారమును చేయకపోవును. సరిగా చేసినను నష్టమువచ్చినచో విచారింపకయు నుండకపోవును. తుకారామున కట్టిచింత యేమియు లేదు. పైగా విఠోబాస్మరణమున ప్రవృత్తుఁడై వ్యాపారముమాటయే మఱచిపోయెను.

లోకములో నందఱును తుకారామువంటివారే కారు. అయియుండినచో ప్రపంచప్రవృత్తి యెప్పుడో కట్టుబడిపోయియే యుండును. విలువగల సరకుగూడ తుకారాము అట్లు నిర్లక్ష్యముగా ఖర్చుపెట్టియుండఁగా, క్షుద్రమగువస్తువును హెచ్చుధనమున కమ్మవలఁచి యొకఁడు మార్గమధ్యమున నాతని కెదురయ్యెను. తుకారామును చూడఁగానే వాఁడు ధనవంతుఁ డగువర్తకుఁ డని గ్రహించి హరిస్మరణావేశము చూచి సులభముగా మోసపుచ్చవచ్చునని తలంచి "అయ్యా! నావద్ద నొక బంగారు నగ యున్నది. తక్కువవెల కిచ్చివేసెదను. మీరు వర్తకులవలె నున్నారు. మీరు తగినంతధర రాబట్టగలరు

నేను చిక్కులలో పడియుండుటవలన దానిని అయినకాడకే అమ్మజూచుచున్నాను" అనిచెప్పుచు ధగధగలాడుచున్న యొక నగను చూపెను.

అదిచూడఁగానే తుకారాము కండ్లు మిఱుమిట్లుగొనెను. "నగ బాగున్నది. ధనముగల స్త్రీలు చూచినచో దీనిని విడిచి పెట్టరు. ఇది కొని అమ్మితినేని మిరెపకాయలనష్టము కూడి వచ్చుటయేగాక లాభమును వచ్చును" అని యాతఁడు భావించుకొని బేరముచేసెను. తుకారాము స్వభావము కనిపెట్టి ఆగంతుఁడు త్వరగనే బేరము నిరుకుచేసెను; గాని తుకారాము చెంత అంతసొమ్ము లేదు. ఈసంగతి చెప్పి అతఁడు వెనుదీయఁగా ఆగంతుఁడు "దానిని మాత్రము విడువనేల" అని భావించి "అయ్యా! ఇప్పటికి ఉన్నసొమ్ము దయచేయుఁడు. మీరు హరి భక్తులు గావున అసత్యమాడరు. ధనము మీకు గడ్డిపరకతో సమానము; గావున మీమీఁద నాకు నమ్మకముగలదు. మఱి యొకప్పుడువచ్చి నేను మిగిలినసొమ్ము కొనిపోయెద" నని చెప్పెను. తుకారాము ఉన్నసొమ్ము ఇచ్చివేసి నగపుచ్చుకొని తక్కిమ్మాసొమ్ము నిమిత్తము రావలసినవాయిదా తెలిపెను.

ఇద్దఱును బ్రహ్మానందపడిరి. అయితే ఒకనిబ్రహ్మానందము తుచ్ఛమైనది. ఒకనిది అమాయికమైనది. ఏమన? అది గిల్టునగ గాని బంగారు నగకాదు.

ఇంటికి వచ్చినపిదప తుకారాము నగను అందఱకును జూపి "దీని నమ్మెదను, వెల యింత" అని చెప్పెను. నగకావల సినవారు దాని అందమునకు, కాంతికి ముగ్ధులై బేరమాడుచు కంసాలిచేత పరీక్షచేయించుకొనఁగా ఇంకేమున్నది? ఒక్కక్షణ

ములో అగ్నిసాక్షిగా కంసాలి అది గిల్టునగ అని తేల్చివేసెను. కాన వచ్చినవారు ఊర్ధ్వశ్వాసతో పారిపోయిరి. తుకారాము నిర్విణ్ణుఁడయ్యెను; గాని ఒక్కక్షణముమాత్రమే ఆతఁడట్లుండి "విఠోబా నన్ను కరుణించెను. ఈవస్తువు అమ్ముడుపోయియుండినచో నేను ద్రోహినై యుందును. వాస్తవముగా విఠోబా నన్ను పాపకూపమున పడకుండ నుద్ధరించెను" అని యానందించి దానిని విసరిపారవేసెను. రాజభటులు పట్టుకొని తీసికొనిపోయి బాధింపకుండుట యొక్కటే అతనికి లాభమయ్యెను.

ఇట్లు మిరెపకాయలపెట్టుబడి అణాపైసలతోగూడ బుగ్గియగుటవలన ఊరివారందఱు నతనిని నిందించిరి. జిజీబాయియు చాల కోపపడెను.

కాని ఊరకుండిన దినములు గడచుట యెట్లు? వర్తకముతప్ప నతనికి మఱేమియు తెలియదయ్యె. వర్తకము నతఁడెరిగియుండియు నిట్లు పాడుచేయుచుండె. జిజీబాయి అనేక విధముల మొత్తుకొని "ఈసారి మీరు స్వతంత్రించి అమ్మవద్దు. మనయూరివర్తకులను మీకు సాయమిచ్చెదను. వారు చెప్పినట్లు చేయుఁ" డనిచెప్పి ఆమె రెండువందలరూపాయలు అప్పు తెచ్చి భర్తకిచ్చి అతనిని కొందరు వర్తకుల కప్పగించెను. జిజీబాయి యవస్థలకు జాలిబడి వారాతనిని కనిపెట్టి చూచుచు లాభమునకు విక్రయించెద" మని మాటయిచ్చిరి. ఆమె ధనవంతునికొమార్త గావున అప్పు తేగలిగెను.

వర్తకులతోగూడ తుకారాము 'వాలేఘాట్టు' అను చోటికి బయలుదేఱెను. దారిపొడుగునను వారు "హరిభక్తి నిన్నుద్ధరింపదు. అదియేపనిగా నుండుటవలననే నీకీగతిపట్టినది.

పదిమందిని పోషింపఁగలవాఁడ విట్టిస్థితికివచ్చుట నీకు లజ్జాస్పదముగాలేదా? మాకుమాత్రము హరిభక్తిలేదా? మేమవసరము వచ్చినపుడే శ్రీహరిని పూజింతుము. సేవింతుము. అనుక్షణము నదేపనిగాకూర్చుండిన అడుగుకొని తినవలసినదే. ఇఁకనైన బుద్ధితెచ్చుకొనుము. నీవు మగవాఁడవు. ఎట్లయినను బాధలేదు. నీభార్య అయినయింటిబిడ్డ. ఆమె కడగండ్లుపడలేదు. నీవలన ఆమెకు సకలబాధలును కలుగుచున్నవి. ఇఁకనైన ఆమెను సుఖపెట్టుము. భార్య నేడ్పించిన వానికి రౌరవాదినరకములు వచ్చును" అని యాతనిని మందలించుచునే యుండిరి.

యుక్తసమయమున వారు గమ్యస్థానము చేరిరి. అందఱును వర్తకము ప్రారంభించిరి. వారందఱు నెవరికి వారె అమ్మకము చేసికొనుచు తుకారామునుగూడ ఒకకంటితో చూచుచుండిరి.

అమ్మకము పూర్తియయ్యెను. ఎవరికితగినట్లు వారికి లాభమువచ్చినది. తుకారామునకు ఏబదిరూపాయలు మిగిలెను. "ఈలాభము నీభార్యచేతిలోపెట్టినచో ఆమె పొంగిపోవును. ఆయానందము నీవిజయమునకు పునాదియగును" అని వారు తుకారామునకు చెప్పిరి. అతఁడు తలయూపెను.

అందఱును "ఇఁక పోద" మని కూడబలుకుకొనిరి. ప్రయాణము సిద్ధమయ్యెను. ఇట్టిసమయమున రాజభటులొక బ్రాహ్మణుని తీసికొనిపోవుచుండిరి. అతఁడొకనివద్ద అప్పుచేసి తీర్చలేకపోవుటవలన అధికారులు శిక్షించిరి. అతని చేతులకు కాళ్లకును సంకెలలు వేయఁబడియుండెను. మెడలోనున్న భారమైన సంకెలవలన నతఁడు వంగిపోయి నడచుచుండెను. సాధ్వీ

మతల్లి యగు నతనిభార్య భర్తకువచ్చిన చిక్కులకు పరితపించుచు వెంటవచ్చుచుండెను.

రాజభటులు వెంటవచ్చుచుండ ఇట్లు బాధపడుచునే అతఁడు పండ్రెండుసంవత్సరములనుండి యాచనచేసి ఆయప్పు తీర్చుచుండెను.

మన ముఠావర్తకులు అణా, బేడ చొప్పున ఎవరికితోఁచినది వారిచ్చిరి; గాని తుకారామునకు ఆబ్రాహ్మణునిచూడఁగానే ప్రాణము లెగిరిపోయెను. "ధనమునిమిత్తము లోకములో నెంతెంత ఘోరములు జరుగుచున్నవి. సర్వనాశకమగు ధనమునిమిత్తము మానవు లెంత క్షుద్రులై పోవుచున్నారు" అనితలఁచి యాతఁడు తోటివారు "వలదు వల" దనుచుండఁగా సంగతియంతయు తెలిసికొని ఆబ్రాహ్మణుఁ డీయవలసినది తానిచ్చి, రాజభటులను పంపివేసి బ్రాహ్మణుని బంధముక్తునిచేసెను. అంతేగాక ఆదంపతులకు అభ్యంగనముచేయించి, నూతనవస్త్రములిచ్చి మిగిలినసొమ్ము దక్షిణగా నిచ్చి తాను బ్రహ్మానందపడి వారిని పంపివేసెను. ఆదంపతులు తుకారాము ననేకవిధముల గీర్తించుకొనుచు వెడలిపోయిరి.

ఇదియంతయు చూచితోడివర్తకులు తుకారాము పిచ్చివాఁడని అనేకవిధముల నిందించి విడిచి వెడలిపోయిరి.

తుకారాము రాకపూర్వమే యీసంగతి యింటివద్ద తెలిసిపోయెను. ఊరివారందఱు "నిది యున్మాదమే, సందేహము లే" దనిరి. ఈసిద్ధాంతమును పురస్కరించుకొని కొందఱు స్త్రీలు జిజీబాయిని పరామర్శకూడచేసిరి. అసలే ఉడికిపోవుచుండిన ఆమెహృదయము దహించుకొనిపోసాగెను.

వెంటనే ఆమె యొక్కమాట చెలరేగెను. సహజముగ నామె కోపశీల. భర్త ఒక్కొక్క తప్పుపని చేసినప్పు డామె కోపపడుచునే యుండెను; గాని యిప్పు డామెకు సముద్ర మంతకోపము వచ్చెను. దానితో చాలసేపామె భర్తను నిందించి, కసరి, గదిమి, బుస్సలు కొట్టికొట్టి చప్పగా చల్లారినది.

ఈదుఃఖ మిట్లుండఁగా ఆసమయమునందే మహారాష్ట్రమున క్షామము సంభవించెను. వర్షములు బొత్తిగా వెనుక బట్టెను. సస్యములు పూర్తిగానాశనమయ్యెను. కొలఁదిదినముల యందే నిలువయున్న పదార్థములుగూడ దిగతీతపట్టెను.

ప్రజలు ఎండిపోయిన చెఱువునందలి చేపలవలె బైట పడిరి. పేదలు ధనికులు నొక్కస్థితికి వచ్చిరి. అందరికి నాకలములు, దుంపలును గతియయ్యెను.

క్షామదేవత పూర్ణోత్సాహముతో తాండవమాడెను.

లక్షలకొలఁదిజనులు చచ్చిపోయిరి. కొన్నికుటుంబములు పూర్తిగా నాశనమైపోయెను. కొన్నిశవములకు సంస్కారము చేయుటకే దిక్కులేకపోయెను.

అసలే శ్వాసకాసపీడితురాలగు తుకారాము ప్రథమ భార్య క్షామమునకు బలియయ్యెను. మఱికొన్నిదినములకాతని ప్రథమపుత్త్రుఁడుకూడ గతించెను.

ఈసందర్భమున ఒకమూల క్షామమువలన పీడింపఁబడు చుండియుగూడ జనులందరును "దుఃఖమును బుద్ధిపూర్వకముగా తెచ్చిపెట్టుకొనినాఁ" డని నిందింపసాగిరి.

పెద్దకొడుకుగూడ పోవుటవలన ఆతఁడు మఱెంత దుఃఖించెను. "విఠోబా యిప్పు డేమయ్యె" నని కొందఱు హేళన

చేసిరి. భార్య, కొడుకులమృతికంటె ఇది ఆతని కెక్కువ దుఃఖ కారణమయ్యెను. "విఠోబా నాశ్రయింపనివారి భార్యాపుత్రులు మాత్రము గతించుట లేదా? వారినిమాత్రము క్షామము పీడించుట లేదా? అయ్యో! ఈజనులు విఠోబా నేల నిందించెదరు?" అని యాతఁ డందుకు చాల వగచి "విఠోబా! జగదీశా! ఈ ప్రపంచమున కంతకునీవే కర్తవు. హర్తవు. సృష్టికి కారణమేమో యెఱుంగని మేము వినాశమునకు మాత్ర మెట్లెఱుంగగలము? ప్రభూ! నీపాదారవిందములే నాకు శరణ్యము. నన్ను పాలింపుము" అని ప్రార్థించి తద్గుణకీర్తనమున ఉత్సాహవంతుఁడై నృత్యము ప్రారంభించెను.

---

## చతుర్థాధ్యాయము.

తుకారామున కన్ని వెసలనుండి కష్టము లలముకొనియెను. మఱియొకఁడైనచో నిందుకు బేజారై పోయియుండును. తుకారాము అట్లుకాక సంసారముయొక్క అనిత్యత్వమును శరీరముయొక్క క్షణభంగురతను గుర్తింపసాగెను. తన్మూలమున శ్రీహరిభక్తి యతని కంతకంత కధికమయ్యెనుగాని తరుగలేదు. సుఖములు మానవుని పతనమునకు దారితీయును. కష్టములు నిర్లిప్తుని గావించి మోక్షమార్గమున ప్రవేశపెట్టును. అయితే పూర్వజన్మమున మంచి సంస్కారముకలవారికిమాత్రమే యిట్టిది తటస్థించును. పామరు లట్లుగాక కష్టములు తటస్థించిన కొలదియు క్రుంగి ఆత్మవినాశమునకు పాల్పడెదరు.

సర్వావస్థలయందును మానవుల కీశ్వరుఁడే గతి. కాని సంపదలయం దీజ్ఞానముండదు. ఆపత్తులయందు మాత్రమే ఈశ్వరుఁడు జ్ఞాపకము వచ్చును. ఏల? ఈశ్వరుఁడుమాత్రమే ఆపదుద్ధారకుఁడు. తల్లి, తండ్రి, భార్య, పుత్రులు, బంధువులు— అందఱును ఏమియుసాయపడఁజాలరు. కావుననే ఎల్లరునుగూడ కష్టములలో ఈశ్వరుని స్మరింతురు. అయితే యీస్మరణము ఎల్లపుడును ఉండిన బాగుండును; గాని సంసారప్రవృత్తి యట్టి జ్ఞానము నుండనీయదు; కావుననే సత్యము, శాశ్వతమునైన ఈశ్వరావలంబనము విడిచి పామరులు మాయలో కూలిపోవుదురు. విరాగు లిట్లు కాదు. సంపదలయందే వారికి ఈశ్వరుని యెడల ననంతవిశ్వాస ముండును. ఇఁక విపత్తులు వచ్చినప్పటి సంగతి చెప్పుట యెందుకు? విరాగులు, జ్ఞానులు ఈశ్వరమహిమ నెరింగినవారు గావున కష్టములు తొలఁగిన వెంటనే ఈశ్వరుని మరచిపోరు.

తుకారాముగూడ నట్లే చేసెను. శ్రీహరియెడల నతని భక్తి క్షణక్షణము పెరిగిపోవుచుండెను. సంసారముమీఁది మోహము ఒక్కొక్కచిన్నము చొప్పున తరిగిపోయినకొలఁది నతనికి శ్రీహరిమీఁద భక్తి అపరిమితముగ పెరిగిపోవుచుండెను. సుఖములయందే మానవ సహాయ మత్యల్పము. అయినచో నిఁక కష్టకాలమునాటి మాట చెప్పనేల?

ఊరివారు బంధువులు నిందించుట మానలేదు. అది యొక్కొక్కప్పుడు మేరగూడ మీఁరుచుండెను. అయినను తుకారాము దానికి జంకలేదు. అతఁడు బంధములను పూర్తిగా త్రెంచుకొనుచుండెను. ఎంద రెన్నివిధముల ప్రతిఘటించినను

అతని చిత్తవృత్తి మారలేదు. పుటములు పెట్టినకొలఁది బంగారమునకు వన్నె యధికమగును. అట్లే తుకారామునకు కష్టములు నిందలు హెచ్చినకొలఁది దీక్ష యధికమయ్యెను.

తుద కాతఁ డొకనాఁడు సంసారముయొక్క అసారతను పూర్తిగా నెరింగి దేహూగ్రామమునకు కొంచెము దూరమున నున్న భాస్వానాథపర్వతపరిసరారణ్యమునకు వెడలిపోయెను.

ఈసంగతి యెవరు నెరుఁగరు. అగుటచే వా రాతనికై అనేకస్థలములలో వెదకసాగిరి. తుద కాతనితమ్ముఁ డాతనిని అంబానాథపర్వతమున చూచి బలవంతపెట్టి యింటికితీసికొని వచ్చెను. అప్పటి కాతఁ డిల్లువీడి యేడుదినము లయ్యెను. ఈయేడుదినములు నుపవాసమే. ఏడు కఠినోపవాసములయనంతర మాతఁడు మఱల స్వగృహమున భుజించెను

వర్తకమున తుకారాముపైతృకమగు ఆస్తినంతను పోగొట్టెను. ఆబాపతు ఇప్పుడు తృణమైనను లేదు; గాని తండ్రి పరులవలన వ్రాయించుకొనిన అప్పుపత్రములు మాత్ర ముండెను. "ఇవిమాత్ర మెందుకు?" అని కొని నాతఁడు నదిలో పారవేయఁజూచెను; గాని తమ్ముడు పట్టుపట్టుటవలన సగముమాత్ర మతని కిచ్చి తక్కినవి నదిలో పడవైచెను.

పిదప నాతఁడు ఇంద్రియవ్యాపారములను తగ్గించుకొనుటకు ప్రారంభించెను. అతఁడు దేవాలయములను ఊడ్చి శుభ్రపరుచుచుండెను. క్రమక్రమముగ ఆహారపరిమాణమును తగ్గించెను. నిద్రాకాలమును తగ్గించెను. మఱియు సమీపమున గల "భాండూర్" అనుపర్వతశిఖరమున పగలు గడుపుచు రాత్రులు గ్రామమున సంకీర్తనములు, భజన చేయు

సాగెను. ఇదిచూచి మొదటినుండియు నాతనిని నిందించువారు "ఉన్మాదమువలన ఉన్నదంతయు పోఁగొట్టుకొని, పొట్టకూటికై యిప్పు డీవేషములు వేయుచున్నాఁడు" అని యెదుటనే పలుక సాగిరి.

కాని ఈషణత్రయ దూరుఁడైనవాని కిది యేమిచేయును? ఎవ రేమనుకొనినను అతఁడు లెక్క చేయలేదు. ఇది మొదటి నుండియు నాతని కభ్యాసమే.

తుకారాము నియతముగా నొకస్థలమున భజన చేసికొను చుండును దానికి సమీపమునందే యొకజొన్నచే నుండెను. సస్యము బాగుగా పెరిగి పెద్దపెద్దకంకులు వేసెను. పిట్టల నుండి రక్షించుకొనినచో మంచియాదాయము వచ్చును. క్షేత్రపాలకుఁ డాపనియందు చాల జాగ్రత్తగనే యుండెను. అయినను ఆతఁడు ఏకకాలమున మఱియొక పనికూడ చేసికొన దలఁచి తుకారామునిఁజూచి "నీ వెప్పుడు నిక్కడనే కూర్చుందువు గదా? ఇక్కడ బదులు అక్కడ—నూరుగజములదూరములేదు. ఆమంచెమీఁదకూర్చుండి—నీవు హరిస్మరణము, హరిభజనము మాననక్కరలేదు. ఇంకేమన? పిట్టలను తోలుచు కంకులను భద్రపరిచినచో పండినపంటలో నీకు నాల్గవవంతు ఇచ్చెదను" అనెను. పరోపకారపారీణుఁ డగుతుకారాము డందు కంగీకరింపఁగా క్షేత్రపాలకుఁ డాతని కొకకట్టె, వడిసెల యిచ్చి వెడలిపోయెను.

తుకారాము మంచెయెక్కి నలుదెసలను చూచెను. కంకులు ముదురుచు చాల దర్శనీయములై యుండెను. వాని మీఁద వ్రాలి పిట్టలు కిలకిల లాడుచు ఆకలి తీర్చుకొనుచుండెను.

ఈశ్వరుని సర్వవ్యాపకత నెఱింగినవాని కది యెంత చక్కని సన్నివేశము! దానిని చూచినతోడనే తుకారాముని హృదయ ముప్పొంగిపోయినది. ఆపక్షులు అత్యానందముతో జొన్న లట్లు భుజించుచుండఁగా నాతఁడు వేలకొలఁది క్షుధార్తులకు అన్నముపెట్టు నిష్కాముఁడగు అన్నదాత యెంత ఆనందించునో అంత యానందింపసాగెను.

ఆసన్నివేశమును చూచుటవలన ఆతనికి మఱియొక మేలుకూడ కలిగెను. పక్షులు సంతోషముతో తినుచున్నవి. ఆనందముతో ఎగిరిపోవుచున్నవి. మఱల ఆకలియగువఱకును వాని కాహారవాంఛ కలుగుటలేదు. సంగ్రహణవాంఛ వానికి లేనేలేదు. అట్లని వాని కాహారము దొరకకున్నదా? ఆకలియైన వెంటనే అవి యేమూలకోపోయి క్షణములో తృప్తిగా తిని వచ్చుచునే యున్నవి. మానవుఁ డట్లుగాక సంవత్సరములకు సరిపడు పదార్థములనుగూడ నిలువచేయఁగోరును. ఇదియెంత క్షుద్రమైనవాంఛ. ఇది యొకనినోట మట్టికొట్టుట. ఈశ్వరద్రోహము." అని యాతఁడు నిశ్చయించుకొనియెను. అది మొదలు ఆతనికి "రేపెట్లు" అనుభావము కలుగలేదు. లభించిన తినుట లేకున్న శుభ్రజలములు త్రాగి హరిస్మరణమున మైమఱచుట.

పక్షు లానందముతో తినుచున్నవి. తుకారాము బ్రహ్మానందముతో చూచుచున్నాఁడు. బాగుగనే యున్నది; కాని యీవ్యవహారము ఇంతటితో ముగియునది కాదు. ఒకనాఁడు వచ్చి క్షేత్రపాలకుఁ డంతయు చూచెను. తోడనే యతనికి మీఁదిప్రాణములు మీఁదికే యెగిరిపోయెను. ఏమన; బీజపూర్ణ

ములై యుండుట కంకు లాతనికి నేడు బీజశూన్యములై హృదయవిదారకలుగా నుండెను.

క్షేత్రపాలకుఁడు తగవు పెట్టెను. మధ్యవర్తులు కంకుల పరిమాణమునుబట్టి అంచనాకట్టి ప్రస్తుతస్థితిచూచి తరుగువల నిర్ణయించి తుకారాము క్షేత్రపాలకున కని యిచ్చుకొనునట్లు తీర్పుచెప్పిరి. తుకారాము దానికేమియు విచారింపలేదు. పైఁగా "ఆకలితో నకనకలాడుచువచ్చిన అన్నివేలపక్షులను పార ద్రోలుట యెట్లు? అది భగవంతుని కెంత ద్రోహాము?" అనియెను. అందరు నాతనిని నిందించిరి; గాని కోతలైనతరువాత నూర్చి చూడఁగా గతసంవత్సరము ఫలముకంటె రెండురెట్లు అధిక ముగా నుండెను. అప్పుడు నిందించినవారందరు నిప్పుడు తెల్లఁ బోయిరి.

## పంచమాధ్యాయము.

తుకారామునకు పూర్వ మేడవతరమువాఁడగు విశ్వం భరుఁడు దేహూగ్రామమున విఠోబా ఆలయము కట్టించెనని చెప్పియున్నాము. అయితే కాలక్రమమున నదిశిథిలమై నేటికి పునస్సంస్కారము చేయవలసినస్థితికి వచ్చెను

తుకారాము దృష్టి దానిపైని పడినది. కారణములు తన పూర్వులు నిర్మించుట యొకటి. అది తన యిష్టదైవమగు విఠో బాదగుట యొకటి. కార్యము మంచిదే. సంకల్పమును యోగ్య

మైనదే. అందు కతనికి అర్హతయు నున్నది. దానివెనుక బాధ్యతగూడ అధికముగనే యున్నది. అయితే డబ్బేదీ?

సత్కార్యములయెడల నాసక్తికలిగియు, సంకల్పము కూడచేసియు నీసమస్య ఎదుర్కొనఁగనే అనేకులు వెనుదీయు చున్నారు; గాని తుకారాము అట్లుచేయలేదు. అతఁడు స్వయముగా మట్టిపిసికి ప్రాకారము తయారుచేసెను. అదియగునప్పటికి ధనము వర్షమువలె కురిసిపోసాగెను.

కర్త సచ్చింతతో నుండినచో, సంకల్పము స్థిరమైనదో ద్రవ్యమున కభావమురాదు. కార్యము ప్రారంభమైన వెంటనే అనేకరూపములతో ధనమువచ్చిపడును. మానవులు ధార్మిక చింతాదూరులుకారు. ప్రోత్సాహముమాత్రమే వారికి కావలెను.

పని అచిరకాలమునందే పూర్తియైనది. విఠోబా ఆలయము సర్వాంగసుందర మయ్యెను. తుకారాముముఖమున మందహాసము, హృదయమున ఆనందముగూడ ఉత్తేజిత మయ్యెను. అంతయు పూర్తియైనపిదప తదంగముగా అనేకులకు మృష్టాన్న దానమును చేయఁబడెను.

కాలము గడచిపోవును. నిలువదు. రావలసినవారందఱును వచ్చుచున్నారో లేదో చూచుట దానిపని కాదు. దొరలిపోవుటయే దానిపని. కాని యది ముందేమి చూపునో యెవరికిని తెలియదు.

తుకారాము ఇంతవఱకు అనేకవేలపర్యాయములు సంకీర్తనములయందు పాల్గొనెను. అనేకలక్షలసారులు భజనము కావించెను. అనేకులగీతములు వినెను. స్వయముగ పాడెను.

కాని యెప్పుడులేనిది ఆతని కొకనాఁడు కీర్తనలుచేసి విఠోబా కర్పింపవలయునని ఆతనికి సంకల్పము కలిగెను.

అయితే ఇంతవఱకు నాతని కది అచుంబితప్రక్రియ. పరిచయమైన వర్తకమునే అతఁడు చేయఁజాలకపోయెను. ఇఁక ముక్కు మొగము నెఱుఁగని కవిత్వమా?

కాని అతఁడు నిరుత్సాహపడలేదు. అయితే ఆపట్టున కూర్చుండి అతఁడు గీతము లల్లలేదు.

అతఁడు నామదేవునిఅభంగములు వల్లించెను. కబీరు కీర్తనలు, జ్ఞానేశ్వరుని గీతావ్యాఖ్యానము, ఏకనాథస్వామి భావార్థరామాయణము, యోగవాశిష్ఠము, శ్రీమద్భాగవత వ్యాఖ్యానము మున్నగు ననేకగ్రంథము లాతఁడు చాల పరిశీలనముచేయుచు చదివెను.

దీనితో భక్తియొక్కతత్త్వ మాతనికి విశదమైనది. భాషలో ప్రావీణ్య మలవడినది. ఛందస్సు పరిచితమైనది. కవితాధార ఉప్పొంగినది. తోడనే మన పోతరాజువలె అతఁడు మహాకవియయ్యెను.

ఇది యిట్లుండ సకలవస్తువులయందు నీశ్వరసాక్షాత్కారము కాంచుచున్నవాఁడు; గావున నాతఁడు అదిమొదలు సకల చేతనములకును సేవచేయుటకు ప్రారంభించెను. పిండిశర్కరగొనిపోయి చీమలపుట్టలలో పోయును. మేతలేనిపశువులకు మేతవేయుచు, దప్పిగొనినపశువులకు నీరుపెట్టును. భక్తులు భజనము, సంకీర్తనము చేయుచుండుస్థలములను వారికి కంట కాదులవలన బాధలుకలుగకుండుటకై సరిచేసి తుడిచి నీళ్లుచల్లి బాగుచేయుచుండును. యాత్రాపరు లెవరైన వచ్చిన వా

రున్నంతకాలమును కనిపెట్టుకొనియుండి సకలసాహాయ్యములు చేయును. వారిలో దూరప్రయాణముచేసి వచ్చినవారికాళ్లకు నూనె మర్దనాచేసి వేడినీళ్లతో కడిగి శ్రమపోగొట్టును. చాల రాత్రివఱకును భజనచేసి ఒటంరిగ నిండ్లకు పోలేనివారిని వెంట వెళ్లి దిగవిడిచి వచ్చును. ఇట్లాత డిది యది యనక అందరికి నన్నివిధములను సేవలుచేయుచు నన్నిటను ఈశ్వరతృప్తిని గాంచుచు సంతసించుచుండెను.

ఒకనాఁ డొకవృద్ధస్త్రీ బజారునకు బయలుదేఱెను. ఆమె శతవృద్ధు అగుటవలనను నడుము వంగిపోయి యుండుటవలనను నడువలేక నడువలేక తప్పనిసరియగుటచే ఎట్లో వెడలుచుండెను. ఇట్టిస్థితిలో నామె యతని కన్నులబడెను. తోడనే యాతఁ డామెను సమీపించి "అమ్మా! నీవు నడువజాలవు. నావీపున కూర్చుండుము. నీపని యగునంతవఱకు నుండి నీయింటికి దీసికొనిపోయి విడిచిపెట్టెదను," అని చెప్పెను. అందు కామె సంతసించెను; గాని "నాయనా! నీవు నాకొడుకువంటివాడవు. అయితే నేను నీవీపున నెక్కుట నాకును నీకునుగూడ కష్టమే. అంతకంటె నీవు బజారునకుపోయి నూనెతెచ్చిపెట్టెదవేని నీవు వచ్చునప్పటికి నేను నెమ్మదిగ నింటికిచేరెదను. నీమే లెప్పటికిని మఱువను. మాయిల్లు ఫలానాచోట" అని బదులు చెప్పెను. అందుకు తుకారాము చాలా నానందించి పాత్ర గైకొని అంగడికిపోయెను. అవ్వ ఇంటికి పోయెను.

ఉత్తరక్షణమునందే యాతఁ డామెకు నూనెయిచ్చెను. ఆమె చాల సంతసించి దీవించి పంపివేసెను.

పిదప నామె ఒకనాడు మాటవరుసకు కొందరు స్త్రీలతో జరిగినదంతయు చెప్పి "ఆతనిచేయి యెట్టిదోగాని అతని చేతితో తేబడిన నూనె నాకు చాలదినముల వఱకు నుండినది" అని చెప్పెను.

అదిమొదలు ప్రతిస్త్రీయు నతనికి పని చెప్పసాగెను. ఎందఱెట్టిపను లెన్ని చెప్పినను మాఱు పలుకక, విసుగుకొనక ఆతఁ డన్నియు చేయుచుండెను. ఆతని మానవసేవ కందఱు నాశ్చర్యపడుచుండిరి.

ఆతఁ డిట్లు విశ్వరూపియగు సర్వేశ్వరునకు సేవచేయుచును రాత్రిపూటనైన దేవళమున కరిగి మహోత్సాహముతో పాటలుపాడుచు నృత్యము చేయుట మానలేదు. అతనికి కష్టమనుమాటయైన లేకుండెను.

కాని జిజీబాయి కిదియంతయు కష్టముగా నుండెను ఇది అనవసరమని భర్తకు తెలియగూడదా? ఒకపరాయిమగవానిచే నిట్లు అరవచాకిరీ చేయించుకొనుట కా స్త్రీలకైన సిగ్గుబిడియము లుండగూడదా? ఆమె యిల్లింత కటకటబడినను వారు చేయించుకొనుటగాని, అతఁడు చేయుటగాని మానలేదు.

ఒకప్పు డాతఁడు పండరిపురమునకు బయలుదేఱెను. హరిస్మరణము, భజనము చేయుచు మైమఱచి నృత్యము చేయుచు బోవుచుండగా నాతఁ డొకచో నిద్రవచ్చి మార్గమ్మునందే శయనించెను. కొంతసేపటికి విఠోబా నామదేవునితో వచ్చి స్వప్నమున సాక్షాత్కరించి "వత్సా! ఈనామదేవుడు తలచికొనినన్ని అభంగములను పూర్తిచేయలేకపోయెను. నీకు నేను కూలంకషమైన కవితాశక్తి నిచ్చెద. గావున వానిని పూర్తి

చేసి, భక్తియోగము నుపదేశించి పతితలోకము నుద్ధరింపుము” అని యానతిచ్చి తిరోహితుఁడయ్యెను.

ఇంతవఱకు నతఁడు సాధనసామగ్రి నంతను సమకూర్చుకొనియుండెను; గాని కవిత్వము ప్రారంభింపలేదు. దీనితో నతనికి చాలధైర్యమే కాక ఆత్రముకూడ కలిగెను. ఏమన? సాధనసామగ్రిసంపాదనమున కతని కాత్మేచ్ఛయే కారణమై యుండెను. ఇపు డీశ్వరాజ్ఞ మైనది. అందును నామదేవుని యభంగములను పూర్తిచేయవలసివచ్చుట, “విఠోబా నాసేవ నంగీకరించె” నని యాతఁ డానందించెను.

ప్రతిదినమును సంకీర్తనము జరుగుచుండెను. ఇంతవఱకు నతఁ డాసమయములయందు ఇతరులు చేసినవానిని గానము చేయుచుండును. ఇప్పు డట్లుగాక భజనము, సంకీర్తనము ప్రారంభించినవెంటనే అమృతగుళికలవంటి యభంగములు ఆతని ముఖమునుండియె వెలువడుచుండెను.

పూవుపుట్టిన పరిమళము దానివద్దనె యుండిపోదు. అట్లే తుకారాముని యభంగములు ప్రారంభమైనవెంటనే చాలదూరప్రదేశములలో గానము చేయబడసాగెను. భజనములయందు, సంకీర్తనములయందు నవిగూడ వాడబడుచుండెను. మఱియు రసగ్రహణచతురులు తీరికూర్చుండియు దానినే పరిశీలనము చేయుచు చదువుచుండిరి.

దీనితో తీర్థక్షేత్రముల కరుగున ట్లనేకులు ఆతని దర్శించుటకై వచ్చి భజనమునందును, సంకీర్తనమునందును పాల్గొనసాగిరి. ఎక్కడ విన్నను తుకారాముని నామమే. ఎక్కడ ఆలించినను ఆతని యభంగములే.

అతఁడు ఉన్మాది యని తలచినవారు, హేళనము చేసిన వారు నిప్పటికి కన్నులు తెఱచిరి. అతఁడు వాస్తవముగా భక్తుఁడే యని వారికి నెమరునకు వచ్చినది. ప్రారంభావస్థలో సాధకులందరును ఇట్టియవస్థలను పొందవలసినదే. అయితే నిరంతరపరిశ్రమవలన, సాధనమువలన వారిఔన్నత్యము, మహిమ వెల్లడియై జనాదరము సంభవించుచుండును.

తుకారాము అప్పటి యొగతాళికి క్రుంగిపోలేదు. ఇప్పటి పొగడ్తకు పొంగిపోలేదు.

---

## షష్ఠాధ్యాయము.

మనోహరమగు నీకవితాధార ప్రారంభమైన తరువాత తుకారామునకు ఈశ్వరాన్వేషణకార్యమునకై సంసారము పరిత్యజించి నిర్జనారణ్యములకు పోనక్కర లేదనియు, ఏకాగ్రత యున్నచోట దానికేదియు భంగము కలిగింపజాలదనియు తెలిసికొనియెను. అయితే దీనివలన అతఁడు మఱల విషయ సుఖలోలుఁ డయ్యెనని చెప్పుటకాదు. అతఁ డప్పటితో అరణ్యములకు పర్వతములకు పోవుట తగ్గించెను. దేహూగ్రామమున నుండియే భజనమునందును, సంకీర్తనమునందును నిమగ్నుఁడై యుండసాగెను.

ఇట్లు తుకారాము ప్రఖ్యాతి దేశము నలుమూలలను ప్రాకిపోవుచుండెను. అందు కాతనికి ఆనందముగాని, యుత్సాహముగాని కలుగుటలేదు. దూషణభూషణాది ద్వంద్వముల కన్నిటికి నాతఁ డిదివఱకే పూర్తిగా అతీతుఁడై యుండెను. అయితే

అతని మహాత్త్వమును, శిష్యబాహుళ్యమును, అతనిని పూజించుటయందు, నాదరించుటయందును ప్రజలు చూపుచున్న ఔత్కంఠ్యమును చూచి మాస్వాజీబాబా యనుసాధువు చాల అసూయపడజొచ్చెను. అతఁడు దేహూగ్రామమునందే యొక మఠమును నిర్మించుకొని యందు వసించుచు, శిష్యుల నాకర్షించుచు, ప్రజలవలన పూజలందుచుండెను. అగుటచే తుకారాముని అభ్యుదయము తన కభ్యంతరమగునని యాతఁడు భావించెను. అందును తుకారాము అభంగములను రచింప దొడఁగినది మొదలు ఈయసూయ మఱింత పెంచుకొనెను.

ఒకప్పుడు తుకారాముగేదె, కట్టుత్రాడు త్రెంచుకొనిపోయి మాస్వాజీపూలతోటలో బడి చాల పాడుచేసెను. ఇది యాతని క్రోధమును పెంచెను; గాని యతికష్టముమీఁద నప్పటి కెట్లో సహించియుండెను. తరువాత నొకయేకాదశికి విఠోబాను సేవించుట కనేకభక్తులు రాసాగిరి. అపుడు మాస్వాజీ తనతోటచుట్టును ముండ్లకంచెలు దట్టముగా వేయించెను. ఆకంచె విఠోబామందిరమునకు సరిహద్దున నుండుటచే ప్రదక్షిణము చేయుభక్తులకు అడ్డువచ్చునని తలచి తుకారాము ఆదెసనున్న, దానిని తీసివేసి ముండ్ల నేరుచుండెను. ఇది తెలిసి మాస్వాజీ మహాగ్రహముతో వచ్చి ముండ్లమండతో తుకారాము వీపుమీఁద చాలదెబ్బలు కొట్టెను. వజ్రాఘాతములవంటి దెబ్బలేగాక ముండ్లుకూడ బాణములవలె గ్రుచ్చుకొనుచుండినను తుకారాము మాట్లాడక సకలమునకు విఠోభానే నమ్మి తన్నామస్మరణమే చేయుచు సహించియుండెను. కొంతసేపటికి చేతులు నొప్పియెత్తగా మాస్వాజీ మఠమునకు వెడలిపోయెను.

అపుడు తుకారాము విఠోబామందిరమున కరిగి స్వామి యెదుట మోకారించి "రుక్మిణీ మనోహరా! నీలీలలు అవాఙ్మాన సగోచరములు. కారయితవును నీవే. కర్తవును నీవే. భోజ్యమును నీవే. తుదకు భోక్తవును నీవే" అని విన్నవించి యింటికి పోయెను.

జరిగినదంతయు వినియు, ప్రత్యక్షముగ చూచియు, భర్త యింటికిరాగానే జిజీబాయి చాల దుఃఖించి నెమ్మదిగ ఆముండ్లనన్నిటిని తీసివేసి సేవచేసెను. గృహనిర్వాహణము సందర్భమున ఆమె భర్తను గదుముచుండినను సహజముగ నామె పతిభక్తిపరాయణురాలై యుండెను.

జిజీబాయి యిట్లు శుశ్రూషచేయగా తుకారాము కొంత సేపటికి స్వస్థతచెందెను. రాత్రి యాతఁడు యథాపూర్వముగ సంకీర్తనమున కరిగెను; గాని మాస్వాజీమాత్రము రాడయ్యె. తుకారాముపంపున శిష్యులుపోయి యాహ్వానించిరి; గాని సిగ్గు వలన "ఒడలంతయు నొప్పిగా నున్నది. రాజాల" నని తిరస్కరించెను. అదివిని తుకారామే స్వయముగా వెడలి "స్వామీ! నన్ను కొట్టుటలో మీరు శ్రమపడియున్నారు. అందువలననే మీయొడలు నొప్పిగా నున్నది" అని పలుకుచు ఒడలు బాగా పట్టుచు "స్వామీ! మీరు రాకున్న సంకీర్తనమున మాధుర్యమే యుండదు. జరుగకయేపోవుటగూడ తటస్థింపవచ్చు" నని చెప్పెను. దానిమీద ఒకమూల లజ్జ హృదయమును దహించివేయుచుండినను చేయునదిలేక మాస్వాజీ సంకీర్తనమున కరిగెను. ఇదిచూచి అందఱును మాస్వాజీ విడంబనములును, తుకారాము ఔన్నత్యమును చక్కగా గ్రహించిరి. అది

మొదలు మహాస్వామీ తుకారాము పరమభాగవతాగ్రేసరుఁడని గ్రహించి, పూజింపసాగెను.

తుకారామున కింతవఱకును గురువు లేఁడు. గురూపదేశము పొందవలయునని యాతనికి తోచలేదు. గాని యిప్పుడది లేకపోవుట యాతఁడు చాలలోపముగా భావింపసాగెను.

ఒకరాత్రి అతఁడు హరిభజనానంతరము ఈవిషయమునే తలంచుకొనుచు నిద్రపోయెను. కొంతసేపటికొకస్వప్నము వచ్చెను. తుకారాము ఇంద్రాణీనదిలో స్నానముచేసి విఠోబా మందిరమున కరుగుచుండగా మధ్యమార్గమున నొకవృద్ధబ్రాహ్మణుఁడు కాన్పించెను. తోడనే యాతఁడు తనఅలవాటు చొప్పున ఆయనకు సాష్టాంగనమస్కారము లాచరించెను. అంతట నాబ్రాహ్మణుఁడు తుకారాముని లేవదీసి కూర్చుండబెట్టి "నాయనా! రాఘవచైతన్యులవారికి కేశవచైతన్యులు శిష్యులు. వారికి నేను శిష్యుఁడను. నాపేరు బాబాజీచైతన్యుఁడు" అని చెప్పి శిరమున చేయిడి "రామ, కృష్ణ, హరి" అని మంత్రోపదేశము చేసెను. అది యైనతరువాత తుకారాము మఱల సాష్టాంగనమస్కారము లాచరించి "మీ రీదినమున నాగృహమునకు దయచేయవలయు" నని ప్రార్థించెను. బ్రాహ్మణుఁ డట్లే చేసెను. గాని అతిథిని వెంటనిడుకొని వచ్చుటవలన జిజీబాయి కలహమాడెను. ఇది చూచి బ్రాహ్మణుఁడు అంతర్ధానమైపోయెను. తరువాత తుకారామునకు మెలకువ వచ్చెను.

విఠోబాయె తనకు స్వయముగ గురువై మంత్రోపదేశము చేసెనని తుకారాము భావించెను; గాని భార్యప్రవర్తన యాతనికి సహింపరానిదిగా నుండెను. ఒక్కయతిథినిగూడ

ఇంటికితెచ్చుటకు వీలు లేకుండెను. అంతట నాతఁ "డిక యింట నుండగూడ" దని తలచి సమీపమునందలి అరణ్యమునకు వెడలిపోయెను.

స్నానమునిమిత్తము అతఁడు ఇంద్రాణీనదికి వచ్చి విఠోబాను సేవించుచు తక్కిన్నా కాలమంతయు నత దరణ్యమునందే యుండును. ఆతని నంగతి నెరిగియున్నవారే గావున పరమ భక్తితో నాహార మాయరణ్యమునకే కొనిపోయి పెట్టుచుండిరి. ఇట్లాతఁ డెవరైన తెచ్చియిచ్చిన భుజించును. లేకున్న ఉపవసించును.

ఇట్లు రెండుమాసములు గడచెను. జిజీబాయికి చాల దుఃఖము వచ్చెను. తనకలహాశీలత వలననే భర్త యిట్లు గృహత్యాగము చేయుచున్నాడని యామె చాలపశ్చాత్తాపపడి ఒకనాఁ డతఁడు నదిలో స్నానము చేయుచున్నపుడు పోయి చేయిపట్టుకొని "నాయపరాధములను మన్నింపుడు. ఇక మీకు ఎదురాడను. మీసెలవు చొప్పున ప్రవర్తించెద" నని బతిమాలి యింటికి తీసికొనివచ్చెను. అప్పుడు తుకారాము "రుక్మిణీకృష్ణులే జగత్తున కంతకును తలిదండ్రులు. వారి నాశ్రయించిన వారి కేలోపములు నుండవు. నీవు వారి నాశ్రయించెదవేని ఆనంద మనుభవింతు" వని చెప్పెను.

అదిమొదలు తుకారాము గృహామునందే భజనములు, సంకీర్తనములు జరుగసాగెను. అపుడపుడు ఆతఁడు జిజీబాయికి శాంతిశమదమాదులు బోధించుచుండెను. "మనగృహ మొక తీర్థము కాదు. క్షేత్రము కాదు; గాని వేలకొలది ప్రజలను దినము నిక్కడను వచ్చుచున్నారు. వారి కిక్కడ నేమి లభించు

చున్నది? మనము వారికేమి సేవలు చేయగలుగుచున్నాము? కాని యివియేమియు వారు పరిగణించుట లేదు. వారికి కావలసినది విఠోబాభజనము. సంకీర్తనము. అది యిక్కడ వారికి పుష్కలముగా లభించుచున్నది. కావుననే వారు దూరదూరమునుండి యిక్కడకు వచ్చుచున్నారు. విఠోబానామమునం దెంత మాహాత్మ్యమున్నదో చూచితివా? మాయయందే యెందుకు కూలబడిపోయెదవు? నీవును విఠోబా నాశ్రయింపుము. సంసారముమీద ఆసక్తి యున్నంతకాలము నిశ్చలమైనభక్తి యలవడదు. గావున శుభదినమున మనయింటగలవన్నియు పాత్రులకిచ్చివేయుము. విఠోబాయే మనలను కాపాడును. రేపు శుభదినము. గావున రేపే దానముచేసివేయుము" అని యొకనాడు బోధింపగా జిజీబాయి యంగీకరించెను.

మఱునాడే యతఁడు ఇంటగల సమస్తవస్తువులను బీదలకిచ్చివేసెను. తుద కొకస్త్రీ వచ్చి "నాకు కట్టుకొనుటకు ఏమియు లేదు. వస్త్ర మిమ్ము" అని కోరెను. తోడనే తుకారాముభార్య చీరయిచ్చివేసెను. కట్టుకొనియున్నది కాక ఆమె కా యొక్కచీర మాత్రమే యుండెను. అదియైన జీర్ణమైయుండెను. అంతవరకు నామె ఉల్లాసముతోడనే యుండెను. గాని చీరయిచ్చివేయుట తోడనే ఓరిమివహింపజాలక, ఉడుకుబోతుతనము పట్టజాలక భర్తను చాల నిందించెను; గాని అతఁ డందుకు జవాబు చెప్పలేదు. వర్షములో నిశ్చలమై యుండుపర్వతమువలె నతఁడు నిశ్చలుఁడై అదియంతయు సహించెను.

ఒకప్పు డొకవర్తకుఁడు తనకొకప్రయత్నమున విజయము లభించినచో చాలరొక్కము సమర్పించెదనని మ్రొక్క

కొని, అది లభింపగా జ్ఞానేశ్వరున కీయ సంకల్పించుకొనిన ధనమును అతని యాజ్ఞానుసారము తుకారామున కీయదల చెను. అయితే తుకారా మెవరివలనను కొంచెమైన ధనము పుచ్చుకొనడు. ఆవర్తకుఁ డీసంగతి యెఱింగియుండుటవలన మిగులనేర్పుతో ఒకటెంకాయలో తానీయదలచిన ధనమునకు సరిపడునట్లు ముత్యములు, రత్నములు నుంచి యిచ్చెను.

ఇది యిట్లుండగా నొకబ్రాహ్మణుఁడు పండరినాథుని జ్ఞానభిక్షకై యాశ్రయించెను. కొంతకాలమైన తరువాత పండరినాథుఁడు "జ్ఞానేశ్వరుని సమాధి నాశ్రయింపు" మని ఆబ్రాహ్మణునకు స్వప్నమున చెప్పెను. అత డట్లే చేయగా కొంతకాలమునకు తుకారాముచెంత కరుగుమని మఱల యాజ్ఞయయ్యెను. వెంటనే యతడు దేహూగ్రామమునకు పోయి తుకారామునాశ్రయించెను. సరిగా ఈసమయమునందే ఆవర్తకుఁడు టెంకాయ సమర్పించియుండెను. అంతట సకలమును విని తుకారాము ఆ టెంకాయను పదునొక్క అభంగములను ఆబ్రాహ్మణునకిచ్చెను.

బ్రాహ్మణుఁడు సంస్కృతపండితుఁడు. దేశభాషలనిన అతనికి చాల నిరసనబుద్ధి యుండెను. అగుటచే నతడు తనకు తుకారాము సంస్కృతమునగాక మహారాష్ట్రమున జ్ఞానబోధ గావించుటవలన ఆయభంగములను, ఆఫలమును అక్కడనే విడిచి మఱల జ్ఞానేశ్వరుని సమాధిచెంత కరిగెను. అతడు వెడలి పోయినవెంటనే ఖండోబా యను మఱియొక బ్రాహ్మణుఁడు రాగా తుకారాము వానిని అతని కిచ్చివేసెను. ఖండోబా మహాభక్తుఁ డగుతుకారాము ఏదియొసంగిన అదియే మహా

మేరు వని యానందించుచు, వానిని గొనిపోయి యింటివద్ద టెంకాయ పగులగొట్టి చూడగా అందు రత్నములును, ముత్యములు నుండెను. "తుకారాము మహాభక్తుఁడు గావున ఆయన యిచ్చిన ప్రసాదము యిట్టిదయిన"దని యాతఁ డెంతో సంతోషించెను.

తుకారామునకు ముగ్గురు కొమార్తెలు, నిరువురు కుమారులు నుండిరి. కాలక్రమమున పెద్దపిల్ల వివాహయోగ్య యయ్యెను. అదిచూచి జిజీబాయి వరుని వెదకి తేవలసినదని అనుదినమును తుకారాముతో చెప్పసాగెను. అందుకు విసిగి యతఁ డొకనాఁడు వీధిలో నాడుకొనుచుండిన స్వజాతిబాలురను ముగ్గురను గొనివచ్చి ముగ్గురుకొమార్తెలను ఇచ్చి పెండ్లి చేసెను. అప్పు డాతడు కేవలము నిర్ధనుడై యుండుటవలన పిండివంటలకు బదులు జొన్నరొట్టెలుమాత్రమే అల్లుండ్రకు పెట్టెను. ఇందుకు జిజీబాయి చాల విచారించెను. పైగావియ్యాల వార లేమియందురో యని యామె భయకంపిత కాసాగెను; గాని వా రీసంగతివిని మహాభక్తాగ్రేసరుఁడగు తుకారాముతో తమకు వియ్యమైనందుకు చాల సంతసించిరి.

## సప్తమాధ్యాయము.

దేహూగ్రామమున రామచంద్రభట్టు అను నొక బ్రాహ్మణుడు కలడు. అతడు గొప్పపండితుడు, మఱియు సనాతన ధర్మాభిమాని. అగుటవలన నాతఁడు తుకారాము చేయుచున్న దాని కంగీకరింపజాలక ఆగ్రామాధికారిచెంత కరిగి "శూద్రుడగు తుకారాము వేదములను నేర్చుకొని తద్రహస్యముల నన్ని జాతులవారికి తెలుపుచున్నాడు. మహర్షులు నిర్ణయించిన కర్మకలాపమును తూలనాడుచు, భక్తియోగమే యుత్కృష్టమని బోధించుచు శ్రావ్యమగు సంగీతము నాధారముగా చేసికొని అమాయికులను తనమార్గమునకు త్రిప్పుకొని పాడుచేయుటయేగాక వైదికమతము నపవిత్రపఱుచుచున్నాడు; కావున వానిని శిక్షించి వైదికమతమును కాపాడుడు" అని కోరెను. అది విని వెంటనే ఆయధికారి "తుకారాముని దేహూగ్రామము నుండి తరిమివేయు" మని పటేలున కాజ్ఞాపెంచెను.

ఈసంగతి తుకారామునకు తెలియవచ్చెను. అతఁడందుకు చాల విచారించెను తనపూర్వులందరు నాగ్రామమునందే నివసించియుండుటవలన దానిమీఁద తనసహజముగ నేర్పడిన ఆదరమువలనను, పైగా తన ఇష్టదైవమగు విఠోబా ఆగ్రామమునందే యుండుటవలనను ఆగ్రామమును విడుచుటయనిన అడలిపోవుచు రామచంద్రభట్టు నాశ్రయించిన యీయాపద తొలగిపోవునని తలచి బయలుదేఱెను. అప్పటికి రామచంద్రభట్టు ఇంద్రాణీనదిలో స్నానము చేయుచుండెను. తుకారాము భట్టునకు నమస్కారముచేసి తనపరితాపమంతయు చెప్పుకొనగా అతడు "ఓరీ! నీవు వర్ణాశ్రమాచార ధర్మములను

మంటగలుపుచున్నావు. వేదశాస్త్రముల మహిమను తృణీకరించుచున్నావు. దీనివలన నీవేగాక వినువారును రౌరవాది నరకములకు పోవుదు" రనియెను. దానిమీద తుకారాము "మహానుభావా! నేను విఠోభా ఆజ్ఞానుసారము అభంగములను రచించుచున్నాను" అనఁగా భట్టు మండిపడుచు "విఠోబా నిన్ను వేదశాస్త్రములను తిరస్కరింపుమనియెనా యేమి? నీవు చేయుచున్న దంతయు పాపకార్యమే. నీయభంగములను విని లోకులు చెడుత్రోవలు త్రొక్కుచున్నారు; గావున నికముందు నీవు అభంగములను చెప్పరాదు" అని శాసించెను.

ఇది వినగనే తుకారామునకు శిరమున పిడుగుపడినట్లయ్యెను కొంతతడవున కతఁడు ప్రకృతిస్థుఁడై "అట్లయిన నిదివఱకు చేసిన యభంగములమాట యేమి?" యని యడిగెను. తోడనే భట్టు "వానిని కట్టగట్టి ఇంద్రాణీనదిలో విడువుము" అనియెను.

తుకారామునకు ప్రాణమే పోయిన ట్లయ్యెను. ధనము పోయినందు కాతఁడు విచారింపలేదు. ఆత్మీయులు చనిపోయినందుకును దుఃఖింపలేదు. సకలకష్టములు వచ్చినందుకైనను వగవలేదు; గాని అభంగములు చేయగూడదనిన ఉలికిపడెను. తొల్లిటి యభంగములను నదిలో విసరివేయుమనిన మ్రాన్పడిపోయెను.

అతనిహృదయము వేయిముక్కలైపోయెను. అయినను అతఁడు బ్రాహ్మణుని యాజ్ఞను తిరస్కరింపక అభంగములను కట్టకట్టుకొని విఠోబా ఆలయమున కరిగి "ప్రభూ! రుక్మిణీ నాయకా! నాడుఅభంగములను రచింపుమంటివి. నేడుఈబ్రాహ్మ

ణో త్తమునిద్వారా వానిని నదిలో విడువు" మని ఆజ్ఞాపించి తివి. నీయాజ్ఞ కెందు నడ్డులేదు. మంచిచెడ్డలతోడను, కష్టసుఖములతోడను, లాభనష్టముల చర్చతోడను నాకు సంబంధము లేదు. నీయాజ్ఞను నెరవేర్చుటయె నావిధి. సకలమును నీకు విన్నవించితిని. తొల్లిటివలెనె భవిష్యత్తునగూడ నన్ను ప్రవర్తింపజేయుట నీదే పూచీ" అని విన్నవించి నదీతీరమునకు పోయెను.

నదిని చూడగనే అతనికి విచార ముప్పొంగిపోయినది. హృదయంగమములగు పద్యములు శత్రువులవైనను బహిష్కరించుట కష్టము. అట్టిచో నవి స్వకీయములైనపుడు—అందును సొంతచేతులతో నదిలో విడువవలసి వచ్చినపు డిక చెప్పవలసిన దేమున్నది? కాని తుకారాము ఎట్లో మనస్సును కుదుటబరుచుకొని ఆకట్టను నదిలోనికి విసరివైచి వెక్కివెక్కియేడ్చుచు వెడలిపోయెను.

ఆపోవుటపోవుట అతఁడు మఱల విఠోబామందిరమునకేయరిగి దానికి యెదుటనున్న తులసికోట యరగుమీఁద పరుండి నిద్రాహారములు మాని విఠోబాపాదపద్మముల నేస్మరింపసాగెను. ఇట్లు పదమూఁడుదినములు గడచునప్పటికి ఈవార్త గ్రామమునందేగాక చుట్టుపట్లగూడ తెలిసిపోయెను. అంతట హాహాకారములు బయలుదేరగా అదితెలిసి భట్టు ప్రజాభిప్రాయప్రాబల్యమునకు కొంచెము జంకెను; కాని మఱల ధైర్యమువహించెను.

ఇంతలో విఠోబా గ్రామమునందలి అనేకులకు స్వప్నమున కాన్పించి "తుకారాము అభంగములు నదిలో భద్రముగనున్నవి. వానిని బైటికితీసి అతనికి సమర్పింపుడు" అని చెప్పెను.

మహానందముతో వారట్లుచేయగా, తుకారము చనిపోయిన చంటిబిడ్డ మఱల బ్రతికివచ్చిన తల్లి యెంతసంతసించునో అంత యానందించి విఠోబాను అనేకవిధముల స్తుతించి ఆడుచు పాడుచు వివశుండై యుంటి కరిగెను.

పిదప భట్టు శిష్యులతోగూడ ఒక క్షేత్రమునకు బయలు దేరెను. ఆగ్రామము చేరి అత డొక మహమ్మదీయ ఫకీరుతోట లోని నూతిచెంత స్నానముచేయుచుండెను. అపుడు తదధిపతి యగు ఫకీరు వచ్చి "నీవృత్తాంతమేమి?" అని యడుగగా భట్టు మ్లేచ్ఛు డగుటవలన అతనిని గౌరవింపక పైగా తూలుమాట లుగూడ నాడెను. అందు కాగ్రహించి ఫకీరు భట్టును తిట్టెను.

స్నానమైనది. భట్టు శరీరమున మంటలు ప్రారంభమైనవి. చూచుచుండగనే యవి పెరిగిపోయినవి. ఇక భట్టు కూర్చుండ జాలడు. నిలువజాలడు. పడుకొనజాలడు. ఏమియు చేయలేడు. అంతట భట్టు చేయునదిలేక జ్ఞానేశ్వరుని మఠముచెంత కరిగి ప్రార్థించెను. నాటిరాత్రి స్వప్నమున జ్ఞానేశ్వరుడు కనబడి "నీవు తుకారామునకు కలిగించిన బాధలకిది ప్రతిఫలము. కావున అతనిపాపములు పట్టుటకంటె నీకు తరణోపాయము లేదు" అని చెప్పెను.

భట్టునకు గొప్ప చిక్కువచ్చినది. పండితుడేగాని అతడు మిగుల గర్వపోతు. మంటలబాధ యొకటి. తుకారాము నాశ్రయింపవలసినబాధ యొకటి. అయినను మాఱుదారి లేకపోవుట వలనను, తుకారాముని అభంగములు మఱలవచ్చినవృత్తాంతమును శిష్యులవలన వినియు లజ్జితుండయ్యు, తనయవస్థనంతను తెలుపుచు కటాక్షింపవలసినదని తుకారామున కొకలేఖవ్రాసెను.'

తుకారాము దానిని చదువుకొని, అహంకారమమకారవర్జి తుడు గావున మనోవికారములకు లోనుగాక "మనస్సున కల్మషములేనివానికి శత్రువులు లేరు. ప్రాణికోటియంతయు సమానమే. విఠోబాదేవుని శరణుపొందుము" అని వెంటనే యొక యభంగము వ్రాసిపంపెను. దానిని చదువుకొనినవెంటనె భట్టు తాపము చల్లారెను. అంతట భట్టు ఉత్తరక్షణమునందే తుకారాము దర్శనమునకు బయలుదేరెను. ఈసంగతి తెలిసి తుకారాము ఎదురేగి భట్టునకు మఱల సాష్టాంగవందనం బాచరించెను.

అంతట భట్టును "అపరాధిని క్షమింపుడు" అనుచు సాష్టాంగపడి "మిమ్ము తూలనాడుటవలన, మీయభంగములను నదిలో పారవేయించుటవలన నేను యమయాతన ననుభవించితిని. మీక్రొత్తయభంగము చూడగానే నాబాధలు అన్నియు పోయినవి, గావున నన్ను మీశిష్యకోటిలో చేర్చుకొనుడు" అని ప్రార్థించి అతనిపాదములు పట్టి ఉపదేశముబడసి విఠోబా నామమును స్మరించుచు భజనము ప్రారంభించెను.

## అష్టమాధ్యాయము

ఛత్రపతి శివాజీమహారాజు యొక్క పేరు, చరిత్ర అనేకులు తెలిసికొని యుందురు. అతఁడు స్వధర్మపరిజ్ఞాతయు, స్వధర్మోద్ధారకుడు నగుప్రభువు. ఈసుగుణములే గాక అతనికి రాజ్యాధిపత్యమును లభించుటకు తల్లియగు జిజీబాయి చేసిన

స్వధర్మశిక్షయే కారణము. అతఁడు చిన్నతనమున తల్లియంక తలమున కూర్చుండి రాముఁడు, ఆంజనేయుఁడు, శ్రీకృష్ణుఁడు, ధర్మరాజు, భీముఁడు, అర్జునుఁడు మున్నగు మహారాజులయొక్కయు, మహావీరులయొక్కయు, రాజ్యతంత్రజ్ఞులయొక్కయు చరిత్రములను బాగుగ నభ్యసించియుండెను. మఱియు వశిష్ఠాది మహర్షులయొక్క మాహాత్మ్యమునుగూడ బాగుగ గ్రహించియుండెను. అగుటవలన నాతనికి మొదటినుండి దేవుడనినను, మహాత్ములనినను అధిక భక్తివిశ్వాసము లుండెను. అందువలన అతడు వినినకొలది తుకారామునియెడల గూడ ననురక్తుఁ డయ్యెను.

కాలక్రమమున ఈయనురక్తి భక్తిగా పరిణమించెను. తుద కాతఁడు తుకారాముని సందర్శింపవలచి "తీసికొనిరండు" అని ఛత్రచామరాందోళికాదు లిచ్చి ప్రముఖోద్యోగులను పంపెను. అప్పుడు తుకారాము లోహ అనుగ్రామమున నుండెను. ఉద్యోగులుయుక్తసమయమున తుకారాముని సందర్శించి సాష్టాంగనమస్కారము లాచరించి, తమభాగధేయములను ప్రశంసించుకొని బద్ధాంజలులై "మహాత్మా! మహారాష్ట్రసార్వభౌముఁడగు శ్రీఛత్రపతి శివాజీమహారాజు మమ్ము తమ సన్నిధికి పంపగా వచ్చియున్నాము. మహారాజునకు తమ్ము సందర్శింపవలయు ననునుత్కంఠ అతిమాత్రముగా నున్నది. తాము దయచేసి తనను పరివారమును ఉద్ధరింపవలయునని మహారాజు ప్రార్థనము" అని విన్నవించిరి.

తుకారాము ఆయుద్యోగులను, ఛత్రపతినిగూడ దీవించెను; గాని వెళ్లవలయునని సంకల్ప మాతనికి కలుగలేదు.

అతఁడు విఠోబాను స్మరించి "మహారాజా! నీశక్తిసామర్థ్యములు నీయుద్దేశములు, నీవు చేయుచున్న స్వధర్మోద్ధరణము విన్నాము. నీవు మహారాష్ట్రమునకు నారాయణమూర్తివలె సంరక్షకుడవై యున్నావు. మేము సన్న్యాసులము. మాకు కావలసినది, మేము చేయవలసినది పృథివిమీద నేమియు లేదు. రాజసభలలో సంచరించుటకు మాకేమియు నర్హత లేదు. కావున మమ్ము మరిచిపొమ్ము. నీధర్మమును అప్రమత్తుఁడవై నెఱవేర్చుకొనుము" అని వ్రాసియిచ్చి వారిని పంపివేసెను.

తుకారాముడు వచ్చి తన్ను సకుటుంబపరివారముగ నుద్ధరించునని ఛత్రపతి గంపెడాశతో నుండెను; గాని యీసందేశము నాలకించి చాల విచారించెను.

అయితే "ఆమహానుభావుఁడు రాకున్న మనమే యెందుకక్కడకు పోరాదు?" అని భావించి శివాజీ సకలసన్నాహములతోడను బయలుదేఱెను.

తుకారాము అప్పటికిని లోహాగ్రామమునందే యుండెను. శివాజీరాక విని అతఁడు నిర్విణ్ణుఁడయ్యెను. అంతలో శివాజీ యెదటికివచ్చి సాష్టాంగదండప్రణామము లాచరించి మెడలో పుష్పమాలవైచి సువర్ణముక్తామాణిక్యములతో నిండియున్న సువర్ణకలశమును చేతులలో నుంచుకొని వినయవినమితుఁడై స్వీకరింపవలయునని కోరెను.

అంతట తుకారాము ఆకలశమును కడకంటనైన చూడక "శివాజీ! అల్పాల్పప్రాణి యగుచీమయు, మహారాజును గూడ మాకు సమానులే. రత్నములు, బంగారమును మాకు మట్టికంటె విలువగలవి కావు. మఱియు సంసారమునందున్న

వారి కేవి మిగుల వెలగలవో, ఏవి ప్రాప్యములో, ఏవి ఆనంద జనకములో అవి మాకు తృణముకంటెను నీచములు. త్యాజ్యములు. మఱియు దుఃఖజనకములు. విఠోబా పాదపద్మములు తప్ప మాకు వేఱు ప్రాప్యములు లేవు. విఠోబా యనుగ్రహము వలన భక్తులు పండితులకంటె పండితులు, ధనికులకంటె ధనికులు, మహారాజులకంటె మహారాజులు నైయున్నారు. మాకేమి లోటుగానున్నదని నీ యుపాయనములు గైకొందుము? మమ్ము సంతృప్తిపఱుపగోరెదవేని నీవు తులసిమాలలు ధరింపుము. కాషాయాంబరములు కట్టుము ఏకాదశీవ్రతములు ప్రారంభింపుము. మఱియు హరిభజన గావింపుము" అని చెప్పెను.

ఇది వినగనే శివాజీహృదయము వైరాగ్యబంధుర మయ్యెను. అంతట నాతఁడు ఆకలశమును అందలిధనమును బ్రాహ్మణులకు పంచియిచ్చి తుకారాము భజనము, సంకీర్తనము విని కని యానందించుటకు నాటి కక్కడ నుండిపోయెను.

యుక్తసమయమున భక్తులు, శిష్యులు చేరిరి. చూడ వచ్చినవారసంఖ్యాకులై యుండిరి. అంతట తుకారాము సంకీర్తనము ప్రారంభించెను. తుకారాము చేతులతో తాళములు వాయించుచు, కాళ్లతో నృత్యము చేయుచు నొక్కొక్కమాటు "హరీ" యనినపుడు దిగంతరాళము లన్నియు భక్తిప్రేమలతో నిండిపోయి అక్కడివారి మనస్సులు తాండవముచేయసాగెను. ఒక్కొక్క అభంగము పాడినపుడు అపూర్వమైన భావావేశము గలిగి ఒడలు జల్లుమనుచుండెను.

సంకీర్తనము ముగిసి మంగళహారతి పూర్తియగువఱకును శివాజీ మంత్రముగ్ధునివలె నుండెను.

దీనితో శివాజీకి వైరాగ్యము కలిగెను. "రాజ్యము ఏమైపోయినను పోవుగాక. తత్ప్రియత్నములు నిలిచిపోవుగాక ఏమైనను నాకీ మహాత్ముడే గతి. ఆహా! భక్తులజీవితము లెంత యానందమోహనములు" అని నిశ్చయించుకొని, రాజవేషము తీసివేసి "ఎట్టిసందర్భములు సంభవించినను నాకొఱకు ఎవ్వరును రావల" దని పరివారమునకు కఠినముగా ముదల యిచ్చి అరణ్యమునకు వెడలిపోయెను.

అతఁడు పగలంతయు నరణ్యముననుండి రాత్రులు తుకారాముసంకీర్తనములు వినుటకు లోహగ్రామమునకు వచ్చుచుండెను.

ఇదియంతయుచూచి పరిజనులు దిగ్భ్రాంతులైరి. శివాజీయెదుట వారేమి మాట్లాడుటకు భయకంపితు లగుచుండిరి. అంతట వారిలో కొందరు వెడలిపోయి జరుగుచున్న దంతయు శివాజీ తల్లియగు జిజీబాయి కెరిగించిరి.

ఇది వినుటయే తడవుగ ఆమె వాయువేగ మనోవేగ ములతో వచ్చి తుకారాముపాదములమీద వ్రాలి "మాకు పుత్రభిక్ష దయచేయుము. నాకొడుకు విరాగియైన నాకిక గతి యెవ్వరు? రాజ్యము నెవరు నిలుపుదురు? ముసల్మానులను నిర్జించి స్వధర్మము నెవ రుద్ధరింతురు? మహాత్మా! నేను చెప్పు కొనుటకాదు. మహారాష్ట్రమునకు నాకొడు కొక్కడే యిప్పు డుద్ధారకుఁడై యున్నాడు. అతడు సన్యసించిన నిక జాతి, దేశము నేమి కావలెను?" అని ప్రార్థించెను. అందుకు తుకా

రాము "మీరు భీతిల్లవలదు. నేటిరాత్రి అతఁడు సంకీర్తనము చూచుటకు రాగలఁడు. అపుడు కర్తవ్యము నుపదేశించి మేము మీమనమారుని మీ కీయగలము. అంతవఱకును మీరు విఠోబాను స్మరించుచుండుఁడు" అని ధైర్యముచెప్పి ఆమెను నిలిపివేసెను.

సంకీర్తనసమయమున యథాపూర్వముగ శివాజీ వచ్చెను. అంతయు నైనతరువాత శివాజీ అడవికి పోదలచుచుండగా తుకారాము చెంతను పిలిచి స్వధర్మము బోధించుచు ముందు బ్రాహ్మణులకర్తవ్యము నెఱింగించి తరువాత క్షాత్రమును గుఱించి యిట్లు చెప్పెను. "నీవు క్షత్రియుఁడవు. క్షాత్రధర్మము చాల నిశితమైనది. దుష్టశిక్షణము, శిష్టరక్షణము— ఇదియే క్షాత్రధర్మము. కత్తిపుచ్చుకొని శత్రుసంహారము చేయవలయునేగాని క్షత్రియుఁడు సర్వసంగపరిత్యాగము చేయగూడదు. మఱియు రాజదండము ధరించి ధర్మమును నడుపవలయునేగాని కమండులువు ధరించి భిక్షమెత్తుకొనరాదు. పూర్వపుణ్యవశమున నీవు మహాయోధుఁడవైతివి. యవనులను పారద్రోలి మహారాష్ట్రసామ్రాజ్యమును నెలకొల్పితివి. దేవతలు నీయభ్యుదయము చూచి హర్షించుచున్నారు. నీవు విరాగివైననది యంతయు నేమగును? నిన్ననే ఏర్పడిన మహాసామ్రాజ్యమును నేడే కూలద్రోసెదవా? కావున నీస్వస్థలమునకు బోయి స్వకార్యమున ప్రవృత్తుఁడవగుము. అదియే నీకు ముక్తి కలిగించును. అదియే బ్రహ్మానందము కలిగించును"

ఇదివిని శివాజీ ప్రకృతిస్థుఁడై తుకారామునకును, తల్లికిని సాష్టాంగనమస్కారము లాచరించి రాజచిహ్నములు ధరిం

చెను. అపుడు తుకారాము మఱల నిట్లుచెప్పెను. "నీవు మహా చక్రవర్తివై యున్నావు. నీధర్మము వేరు. నేను నీకు గురువుగా నుండుటకు తగినవాడను గాను. సమర్థరామదాసస్వామి నాశ్రయింపుము. అతఁడు నీకు తగినగురువు" ఇది విని శివాజీ మిగుల నానందించి పరివారముతోడను తల్లితోడను స్వస్థలమునకు వెడలిపోయెను.

ఒకప్పుడు శివాజీ పారవీగడమున శ్రీరామాలయము కట్టించి ప్రాణప్రతిష్ఠామహోత్సవమునకువిద్వాంసులు, జ్ఞానులు, భక్తులు మున్నగువారి ననేకుల నాహ్వానించెను. గురుదేవుఁడగుటవలన రామదాసస్వామి వచ్చియే యుండెను. అనేకవిధముల ప్రార్థించుటవలన ఆయుత్సవమునకు తుకారాముగూడ వచ్చెను.

పండితులు తమపాండిత్యమును ప్రదర్శించిరి. జ్ఞానులు ఆత్మానాత్మవివేకము తెలిపిరి. భక్తులు భజనలు చేసిరి.

సమర్థుని శిష్యురాండ్రగు అకాబాయియు, వేణూబాయియు సంకీర్తనము నెఱపి అందరిని భక్తిపరవశులుగా చేసిరి. తుకారాముగూడ నొకసంకీర్తనము గావించెను.

సంకీర్తనము లన్నియు చిత్తోద్బోధకములుగనే యుండెను; గాని తుకారాము చేసినసంకీర్తనము అసదృశమై అందరిని ముగ్ధులుగజేసెను. ప్రభువులు, భక్తులు, ప్రజలు అనేకవిధముల ప్రార్థించుటవలన తుకారాము నెలదినములుండి ప్రతిదినమును సంకీర్తనలుచేసెను.

శివాజీ అందరిని సత్కరించెను. తుకారామునకు మితిలేనిబంగారమును, నాలుగుగ్రామములను ఈయదలచెను. కాని

యిది యెట్లో గ్రహించి తుకారాము ఎవరికిని తెలియకుండ వెడలిపోయెను. మఱునాడు ఇదివిని శివాజీ చాల విచారించెను; గాని ఏమిలాభము? చలిచీమయు, సార్వభౌముడు నొక్కటే యనియు, బంగారమునకు మృత్తికకు భేదములేదనియు చెప్పిన తుకారాము ఇట్టి కానుక లెట్లు స్వీకరించును?

## నవమాధ్యాయము.

పండరిపురమున జరుగుచుండు ఉత్సవముల కన్నింటికిని తుకారాము అవశ్యము వెడలుచుండెడివాడు; గాని శరీరము జబ్బుపడగా మంచముమీదనే యుండుటవలన ఒక ఉత్సవమునకు వెడలజాలకుండెను. అపుడు ఉత్సవము సమీపించినకొలది నాతడు తల్లిని గోల్పోయిన పసిబిడ్డవలె విఠోబాను తలచుకొనుచు దుఃఖింపసాగెను.

ఇంతలో భక్తులు అనేకులు పండరిపురమునకు గుంపులు గుంపులుగా పోవసాగిరి. ఒకగుంపు హరిభజనము చేయుచు తుకారాము ఇంటిముంగిటికివచ్చెను. అంతట నాతఁ డెట్లో లేచి వచ్చివారిని జూచి "మహానుభావులారా! మీరు ధన్యులు. పండరిపురమున కరిగి పాండురంగని సేవించుటకు మీకు అదృష్టమున్నది. నేను పాపాత్ముడను. కాకున్న నాయాయువు పరిసమాప్తముకానున్న యీసమయమున పండరిపురమునకు పోవుటకు వీలులేనియవస్థ యేల తటస్థించును? అయ్యో! నాకెట్టియనుభవము వచ్చినది!" అని తన విచారమును వెడలగ్రక్కుకొని "ఓభక్తులారా! నే నొకజాబిచ్చెదను. దానిని గొనిపోయి

విన్నవించి పాండురంగనిపాదములమీాద సమర్పింపుడు" అని ప్రార్థించి యిరువదినాలుగు అభంగములు గలజాబు నిచ్చెను. అందలి కొన్నియభంగముల భావ మిట్లుండెను.

"ప్రభూ! జగదీశా! నేనేమి పాపముచేసితి నని నా కీశిక్ష. నాకేల నీదర్శనము లేకుండ జేసితివి? నే నింక నెవ్వరి శరణు జొత్తును? నీవే యిట్లుచేసిన నిక నన్నెవరు చేరనిత్తురు? విపత్తులలో పడిపోకుండ నుద్ధరించుటకు నీకంటె నాకిక దిక్కెవ్వరు? అయ్యో! నాహృదయము దహించుకొనిపోవుచున్నది. నిన్ను జూడవలయు ననుకోరిక పెరిగిపోవుచున్నదే గాని తరుగుట లేదు. కాని యేమిలాభము? కుంటివాడైనను ఎట్లో డేకిరాగలడు. నాసర్వావయవములును జాడ్యగ్రస్తములై నిస్సారములై యున్నవి. నేను నిన్నే నమ్మియున్నాను. నేను నీకు బరువైతినా? నేను నిన్ను చేరుటకు పనికిరాని అభాగ్యుడ నైపోయితినా? అయ్యో! నీవియోగము నెట్లోర్వగలను? నే నిపుడు కంఠగత ప్రాణుడనై యున్నాను. ప్రభూ! ఇట్టిసమయమునందే నాకు నీదర్శనము లేకుండ జేసెదవా?"

భక్తులు ముందుకు సాగిరి. తుకారాముడు వారిని విడువలేక కష్టముమీాద వెంట నడువసాగెను; గాని కొంత దవ్వేగునప్పటికి స్మృతితప్పి పడిపోయెను. అపుడు భక్తు లాతనిని పసిబిడ్డనువలె ఇంటికిచేర్చి వెడలిపోయిరి.

ఉత్సవము ముగిసిన పిదప ఆభక్తులు మఱల స్వస్థలములకు బోవుచు దేహూగ్రామమునకువచ్చి "నీయభంగములను స్వామికి వినిపించితి" మని చెప్పి ఉత్సవవిశేషము లాతని కెరిగించి వెడలి పోయిరి. అట్టి యుత్సవమున తాను పాల్గొనజాలనందుకు అతడు

చాల విచారించెను; గాని వినికిడివలన గూడ దనుభవమును పొందెను.

అప్పుడు మహారాష్ట్రదేశమున యుద్ధదేవత ఒంటికాలి భరతము చేయుచుండెను. ఎక్కడచూచినను హత్యలే. ఏవంక చూచినను గ్రామదహనములే. ఎటు వినినను బంధిపోటువార్తలే. గ్రామములు జనశూన్యములై పోవుచుండెను. కేదారములు సస్యరహితము లగుచుండెను. ఉభయపక్షముల సైనికులును ఒకరినొకరు నరకుకొనుటయేగాక యవనులు ఏసంబంధమును లేనిగ్రామవాసులను బాలబాలికలను స్త్రీలనుగూడ సంహరించు చుండిరి.

ఇది విని, చూచి తుకారాము చాల పరితపింపసాగెను. ఈబీభత్సములను చూడగా నతనిహృదయగోళము పగిలిపోవున ట్లయిపోవుచుండెను. దుఃఖము పెరిగిపోవుచుండెను.

ఇట్టిస్థితిలోగూడ తుకారాము అలోకమహిమాన్వితు డని యెఱింగి అనేకస్త్రీపురుషు లతనిని దర్శించుటకు వచ్చుచుండిరి. రోగములు పోగొట్టుకొనుటకు, సంతానమును బడయుటకు, ఉపదేశములు పడయుటకు, భజనమున పాల్గొనుటకు, సంకీర్తనములు చూచుటకు, అభంగములను వినుటకు, చిత్తశాంతిపొందుటకు—ఇట్లనేకోద్దేశములతో వచ్చి వా రాతనిని ముట్టడించుచుండిరి. ఎవ్వరిని కాదనుటకును అతనికి వీలులేకుండెను. ఇట్లు హరిస్మరణమునకైన అవకాశములేనిస్థితి సంభవించుటవలన నతఁడు ఒకొక్కప్పుడు "ప్రభూ! నన్నిట్టి అస్వతంత్రునిచేసితివేల? నిన్ను స్మరించుటకు—తుదకు నిన్ను ధ్యానించుటకును, భావించుటకునైన సమయము లేకుండ

నున్నది. ఇట్లు నన్ను నీసన్నిధినుండి, నీయంకమునుండి తొలగింపదలచితివా? శ్రీహరీ! నీవిశ్లేషమును సహింపజాలను. నన్ను కొనిపొమ్ము” అని బిగ్గరగా పిలుచుచు దుఃఖింపసాగెను.

తప్పించుకొనరానివార్ధకమునకు తోడు ఉపవాసములు, భజనలు, జాగరణములు, గానములు—ఇట్టివానివలన అతని శరీర మంతకంతకు దుర్బలమై పోవుచుండెను. అయిన నాతఁడు వానిలో వేనినిగూడ మానకుండెను. లోహాగ్రామవాసుల కాతనిమీద అచంచలభక్తి యుండెను. వారిమీద నతనికిని అట్టివాత్సల్యమే యుండెను. అగుటచే అట్టిదుర్బలదశలోగూడ వారియాహ్వానము వచ్చినవెంటనే యతఁ డక్కడ కరిగి సంకీర్తనములు జరిపి వారిని తరింపజేయుచుండెను.

రోజులు గడచినకొలది నాతఁడు “నేను వైకుంఠమునకు పోవుచున్నా” నని పలుకసాగెను. అనేకులు దానిభావమును గ్రహింపజాలకుండిరి. కొందరు ఏదో క్రొత్తక్షేత్రమున కరుగదలచియున్నాఁడని భావించిరి. కొలదిమందిమాత్రమే అతనికి దేహావసానము సమీపించినదని గ్రహించిరి. ఎట్లయినను అందఱు నామాట వినుటకే భయపడుచుండిరి. అది వారి చెవులలో కరగినసీసమువలె పడుచుండెను.

వారిట్లు భయపడినకొలది నతఁ డామాటనే యుచ్చరించుచుండెను.

ఇంతలో దేహూగ్రామమున శ్రీకృష్ణునిమహోత్సవము ప్రారంభమయ్యెను. ప్రతిసంవత్సరముకంటె నాయేఁడది చాల పవిత్రముగను మిగుల వైభవముగను జరిగెను.

చివరిదినమున మంగళహారతి యిచ్చునపుడు భజనము చేయుచు ఆశువుగా క్రొత్తయభంగములను గానముచేయుచు నాతఁడు పరవశుఁడై పోయెను.

అంతయు నైనది. తుకారాము అఖండనృత్యము చేయుచు "నేను వైకుంఠమునకు బోవుచున్నాను. రాదలచినచో త్వరగా రమ్ము" అని భార్యకు వర్తమానము చేసెను; గాని యామె వెనుకటి వలెనే యేదో తీర్థయాత్రకు పోవుచున్నాఁడని తలచి "నే నిపుడు గర్భవతినై యున్నాను. ఈస్థితిలో నిల్లువిడిచి నేనెట్లు రాగలను?" అని బదులు పంపెను.

అది విని తుకారాము భక్తులను శిష్యులను సంబోధించి "నే నిదే వైకుంఠమునకు పోవుచున్నాను. ఇదియే అంతిమ సంకీర్తనము. ఇదియే అంతిమ భజన. ఇదియే మీతోడి అంతిమ సమావేశము. అంతకును శ్రీహరియే యున్నాడు. శ్రీహరిని మఱువకుడు. భజనము, సంకీర్తనము మానకుడు. శ్రీహరినే నమ్మి, శ్రీహరినే కొలువుడు. నాభార్య అమాయికురాలు. ఏమియు నెరుగనిది. ఆమెను కనిపెట్టుకొని చూచుచుండుడు. ఆమెమృదువుగమాట్లాడజాలదు. అయినను మీరాగ్రహింపక మీరామెను కాపాడుడు. పిల్లలను చూచుచుండుడు" అని చెప్పి అందఱికిని సాష్టాంగనమస్కారము లాచరించెను.

అదిచూచి అందఱును నిర్విణ్ణులైరి. ఎవరు నేమియు తెలిసికొనలేకపోయిరి.

అంతట తుకారాము మరల భజనము ప్రారంభించి మైమరచి నృత్యముచేయుచు ఇంద్రాణినదిదెసకు బయలుదేరెను.

అంతయును పరవశులై యుండిరి. ఎవరికి ఏమియు తెలియకుండెను.

తుకారాము నదీతీరమున చాలసేపు భజనము, నృత్యము చేసెను. చివరి అభంగమునుగూడ గానము చేసెను.

ఆభజనము, ఆయభంగము పూర్వముకంటెను దర్శనీయముగను, శ్రావ్యముగను ఉండెను. అందువలన వారందరును తన్మయులై యుండిరి.

ఆసమయమున తుకారాము ఉచ్చస్వరమున విఠోబానాహ్వానించుచు పరవశుఁడై నృత్యముచేయుచు అందరును అభావదృష్టులను బరపుచుండగా పాతనేంద్రాణీనదీజలసమాధిలో ప్రవేశించెను.

ఒక్కక్షణమునకు తెలివివచ్చి చూడగా నిక నేమున్నది? తుకారాము వైకుంఠమునకు వెడలిపోయెను. అందరును అగాధవిచారసాగరమున కొట్టుకొనిపోయిరి.

---

## దశమాధ్యాయము.

నాడు ఫాల్గుణబహుళవిదియ. దేహూగ్రామమున నిప్పటికిని ఆరోజున యొకగొప్ప మహోత్సవము జరుగుచున్నది. అవసానము సమీపించినపుడు తుకారాము "నీగర్భమున నొకమహాభక్తుడున్నాడు. వానికి నారాయణు డని పేరుపెట్టుచున్నాను. అందరు నట్లే వ్యవహరింపు"డని చెప్పెను.

నారదాశ్రమమున నున్నపుడు తనతల్లియగు లీలావతికి నారదుడు చేసిన యుపదేశమువలన ప్రహ్లాదుడు హరిభక్తు

లలో శ్రేష్ఠుడైనట్లు తాను తల్లి గర్భమున నున్న కాలమున తండ్రి హరిభజనము పూర్వాదికమై అనుక్షణము జరిగియుండుటవలన నారాయణుడును పెరిగి పెద్దయై మహాభక్తుడై తండ్రివలెనే భక్తిరసప్లుతములగు అనేకాభంగములను రచించెను.

తుకారాము అనంతరము ఛత్రపతిశివాజీమహారాజు అతని కుటుంబమునకు ఒకమంచి గ్రామము నిచ్చెను. అది యిప్పటికిని ఆవంశమువారి స్వాధీనభుక్తములయందే యున్నది.

తుకారాము అభంగముల వ్రాతప్రతి ఇప్పటికిని తద్వంశమువారిచే పూజింపబడుచున్నది.

---

## ఏకాదశాధ్యాయము.

తుకారాము మహారాష్ట్ర దేశమునందలి మహాభక్తులలో ఉత్తమోత్తముఁడు. ఇతని భక్తి కేవలము సాత్వికము. సకల వస్తువులయందును బ్రహ్మదర్శనమును గాంచినవారిలో తుకారాము ప్రముఖుఁడు. అగుటవలననే అతఁడు అడిగినవారి కందఱకును కాలనియమము లేకుండ చెప్పినపను లన్నియు చేసి సేవించెను. జొన్న చేనులో కాపున్నపుడు అతడు పిట్టలలోగూడ ఈశ్వరునిసందర్శించి "ప్రపంచమంతయు ఈశ్వరాధీనము. ప్రాణికోటియంతయు ఈశ్వరసంతానము. భేదము లేమియు లేవు. ఈశ్వరునకుతప్ప ఏవస్తువును నాది యనుట కెవ్వనికిని అధికారము లేదు. అట్టిచో ఈశ్వరునిసొత్తు అగు ఈఫలమును క్షేత్రపాలకుఁడును నేనును మాత్రమే "నాది" అని

జాగ్రత్తచేసికొనుటకు, భద్రముచేసికొనుటకు నేమి యధికారమున్నది?" అని తలచి వానిని స్వేచ్ఛగా తిననిచ్చెను.

భక్తి చిత్తమును సంస్కరించి మృదువుపరచుటలో సాటిలేనిది. ఈశ్వర ప్రీతిని కలిగించుసాధనములలో నెల్ల భక్తియోగము చాల సులభమైనది. మఱియు పరమపవిత్రమైనది. అట్టి అచంచల భక్తి గలిగి మానవసేవ చేసిన మహానుభావులు మహారాష్ట్రులలో ననేకులున్నారు విశేషించియువనుల దండయాత్రలు, పరిపాలనము సాగినపుడు మహారాష్ట్రమున బయలుదేరిన భక్తులు ప్రజలకు భక్తినేగాక స్వధర్మనిష్ఠను గూడ కలిగించుటవలన మహారాష్ట్రులు సామ్రాజ్యములను నిర్మించుటకును, నేటికిని దృఢమైనజాతీయభావముకలవారగుటకును కారణమైనది.

తుకారాము మహారాష్ట్రులకేగాక ప్రపంచమునందలి సకలజాతులకును పూజ్యుఁడై యున్నాఁడు. అట్టిచో స్వధర్మమును మఱచి భక్తియోగమును విస్మరించి, ఒకపరిష్కృతమైన సాధనప్రణాళికలేని మన ఆంధ్రుల కది ప్రత్యేకశ్రద్ధతో పఠింపవలసిన దగుటలో నాశ్చర్యమేమున్నది?

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1931.

# వచనగ్రంథములు.

| | | రూ. | అ. |
|---|---|---|---|
| | ప్రతి 1-కి | రూ. | అ. |
| ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశత ఘంటము వేంకటరంగశాస్త్రికృతము | ... | 6 | 8 |
| డిటో 3 వాల్యుములు | ... | 7 | 0 |
| ఆంధ్రవచనభారతము, ఆదిసభాపర్వములు | ... | 2 | 8 |
| డిటో ఆరణ్యపర్వము | ... | 2 | 8 |
| తక్కినపర్వములు | (అచ్చగుచున్నవి.) | | |
| ఆంధ్రవచనరామాయణము, వచనము, 7 కాండలు, రెండుసంపుటములు | ... | 12 | 0 |
| ఆంధ్రకవిజీవితములు, శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారిది | ... | 3 | 8 |
| అయిదుగురుదొంగలకథ | ... | 0 | 6 |
| ఆరేబియన్ నైట్సుకథలు | ... | 1 | 4 |
| ఈసఫునీతికథలు, ప్రథమభాగము | ... | 0 | 6 |
| డిటో రెండవభాగము | ... | 0 | 8 |
| గైక్వారుగారి ఉపన్యాసము | ... | 0 | 2 |
| చార్ దర్వేషుకథలు | ... | 0 | 8 |
| తాతాచార్యులకథలు | ... | 0 | 4 |
| తెనాలి రామలింగనికథలు | ... | 0 | 4 |
| దక్కనుపూర్వకథలు | ... | 1 | 8 |
| దశకుమారచరిత్రము, ఎనమచింతల సంజీవరాయశాస్త్రిది | ... | 1 | 8 |
| దేశింగురాజుకథ, (జంగముకథ) | ... | 0 | 6 |
| ద్వాదశోపనిషత్తులు, సంస్కృతమునకు సరియైన తెలుగువచనము | | 3 | 0 |
| నలచరిత్ర, చిన్నసైజు, పటములతో | ... | 0 | 6 |
| నవనాథభక్తులచరిత్ర, శ్రీబచ్చురామన్నగారిది | ... | 2 | 0 |
| నలుగురుమంత్రులకథ | ... | 0 | 4 |
| నీతిచంద్రిక, చిన్నయసూరిది | ... | 0 | 6 |
| పారిష్యావినోదకథలు | ... | 0 | 12 |
| పంచతంత్రము, వచనము, సులభశైలి | ... | 0 | 6 |

| | | ప్రతి 1-కి రూ. | అ. |
|---|---|---|---|
| పరమానందశిష్యులకథ | ... | 0 | 3 |
| పతివ్రతలచరిత్ర, మంగిపూడి, వేంకటశర్మగారిది | ... | 1 | 8 |
| ప్రహ్లాదచరిత్ర, చిన్నసైజు, పటములతో | ... | 0 | 4 |
| బేతాళునికథలు | ... | 0 | 8 |
| భారతరమణీమణులు, ప్రథమభాగము | ... | 0 | 12 |
| డిటో ద్వితీయభాగము | ... | 0 | 8 |
| భోజునికథలు | ... | 0 | 8 |
| భోజకాళిదాసకథలు | ... | 0 | 12 |
| మర్యాదరామన్నకథలు | ... | 0 | 2 |
| మహాభక్తవిజయము, చిత్రపటములతోసహా | ... | 4 | 0 |
| మదనకామరాజుకథ | ... | 0 | 14 |
| యజుర్వేదకథాసంగ్రహము | ... | 0 | 8 |
| రాజశేఖరచరిత్రము, వీరేశలింగముగారిది | ... | 1 | 0 |
| రేచుక్కపగటిచుక్కకథ | ... | 0 | 2 |
| విక్రమార్కునికథలు | ... | 0 | 3 |
| వివేకానందవిజయము | ... | 1 | 12 |
| వీరాంగనలు, శ్రీపాదము సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది | ... | 0 | 12 |
| వైద్యులకథ ,, | ... | 0 | 4 |
| శ్రీరామచంద్రమూర్తి | ... | 0 | 10 |
| శకుంతలచరిత్ర, చిన్నసైజు, పటములతో | ... | 0 | 4 |
| శుకసప్తతికథలు | ... | 0 | 6 |
| షేక్స్పియర్ నాటకకథలు | ... | 1 | 8 |
| సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రిగారిది | ... | 1 | 4 |

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

| | | ప్రతి 1-కి రు. | అ. |
|---|---|---|---|
| క్రిక్ మాండ్ మేజిస్ట్రేటు | ... | 1 | [illegible] |
| సీతారామము, తల్లాప్రగడ సూర్యనారాయణరావు | ... | 1 | [illegible] |
| సుజనరంజని | ... | 0 | [illegible] |
| సౌందర్యతిలక | ... | 1 | [illegible] |
| ఆంధ్రకన్యకాబాలశిక్ష | ... | 0 | [illegible] |
| ఆంధ్రద్రవిడబాలశిక్ష. అరవ మభ్యసింపదలచు ఆంధ్రులకు మిక్కిలి యుపయోగము | ... | 0 | 3 |
| తెనుగుసామెతలు, ఇంగ్లీషుసామెతలు, తర్జుమాతోసహా | ... | 1 | 0 |
| సంజాబుఅల్లగి | ... | 0 | 8 |
| పెద్దబాలశిక్ష, నూతనముద్రితము | ... | 0 | 3 |
| వాసుదేవమననము, వచనము | ... | 0 | 12 |

## ఆంధ్రనిఘంటువులు

| | | | |
|---|---|---|---|
| ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు, టీకతో | ... | 0 | 12 |
| [illegible] బాలకౌముది | ... | 1 | 0 |
| ఆంధ్రభాషార్ణవము, పద్యకావ్యము, కోటి వెంకనార్యకృతము | | 0 | 12 |
| అథర్వణకారికావళి, సటీక | ... | 1 | 0 |
| సులక్షణసారము | ... | 0 | 8 |
| బాలవ్యాకరణము, శ్రీ చిన్నయసూరిగారిది | . | 0 | [illegible] |
| వెంకయ్యవ్యాకరణము (ఆంధ్రవ్యాకరణము) | .. | 0 | 4 |

## సంగీతగ్రంథములు.

| | | | |
|---|---|---|---|
| అధ్యాత్మరామాయణకీర్తనలు | ... | 0 | 10 |
| క్షేత్రయ్యపదములు | ... | 0 | 14 |
| కృష్ణలీలాతరంగిణి | ... | 1 | 8 |
| [illegible]దము | ... | 1 | 4 |

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

292, ఎస్ప్లనేడ్, చెన్నపురి